www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
శుక్రవారం 22 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 46 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్







## నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?

**కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లపై హైకోర్టు ప్రశ్న..**

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదు - నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదు - నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదు
- కమిషన్ సమర్పించిన నివేదికపై ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- రాజకీయంగా బీఆర్ఎస్, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారు..
- కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు విచారణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు

2లో...

## ‘ఓట్ల చోరీ’ రాజ్యాంగంపై దాడి



- లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బీజేపీ తారుమారు చేసింది
- ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ పేరిట ఓట్ల చోరీకి
- కాషాయ పార్టీ యత్నం
- బిహార్ ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు ‘ఇండియా’ కూటమి అనుమతించదు
- ‘ఓటర్ అధికార్ యాత్ర’లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

2లో...



## ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి
# నామినేషన్ దాఖలు

- హాజరైన ఖర్గే, సోనియా, రాహుల్, శరద్‌పవార్
- ఆయనకు మద్దతుగా 160మంది ఎంపిలు సంతకాలు
- జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉంది
- ప్రతి వ్యక్తి గౌరవం పైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉంది
- మీడియాతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

2లో...



2లో...

## ట్రాన్స్‌జెండర్లకు సర్కార్ బంపర్ ఆఫర్



- వారి ఉపాధి అవకాశాల విస్తరణ మరో నిర్ణయం
- ప్రభుత్వ సంస్థల్లో సెక్యూరిటీ విధుల్లో నియమించేందుకు రంగం సిద్ధం
- దశలవారీగా ఐటీ కంపెనీల్లో సెక్యూరిటీ విధుల్లోకి తీసుకునేందుకు ప్రణాళికలు

## నాపై కుట్రలు ఆపడం లేదు..



2లో...

- అమెరికా రాగానే పదవి నుంచి తొలగించారు
- టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షుడి పదవిని కొప్పుల ఈశ్వర్‌కు అప్పగించారు
- రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది
- పదేళ్ల పాటు ఈ పదవిలో మీకు సేవ చేసుకునే అవకాశం నాకు దక్కడం అదృష్టం
- ఎంఎల్‌సి కవిత సంచలన ప్రకటన

## ప్రజాధనం దోపిడీని కచ్చితంగా అడ్డుకుంటాం

- మూసీ సుందరీకరణ పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు
- మూసీ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్
- కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ.1.50లక్షల కోట్లకు పెంచింది- భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

2లో...



## రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలి



2లో...

- అత్యవసరాన్ని గుర్తించి త్వరగా పంపాలి యూరియాను కనీసం
- చూడని నేతలూ విమర్శిన్నారు
- గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల..

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హార్పాల్ సింగ్..
## ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

- భారత సైన్యంలో 40 ఏళ్లకు పైగా పనిచేసిన సింగ్
- భారత రక్షణ దళాల వ్యూహాత్మక మౌలిక సదుపాయాలలో నిష్ణాతుడు






# ‘ఓట్ల చోరీ’రాజ్యాంగంపై దాడి

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బీజేపీ తారుమారు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ‘ఓట్ల చోరీ’ని రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. ఎన్నికల సంఘంతో కాషాయ పార్టీ కుమ్మక్కై ఓట్ల అవకతవకలకు పాల్పడేందుకు అనుమతించబోమని తెలిపారు. ‘ఓటర్ అధికార్ యాత్ర’లో భాగంగా బిహార్‌లోని ముంగేర్‌లో నిర్వహించిన సభలో ఈ మేరకు ఆరోపణలు గుప్పించారు. “ఎన్నికల సంఘం ద్వారా ఓటరు జాబితాల ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ పేరిట ఓట్ల చోరీకి కాషాయ పార్టీ యత్నిస్తోంది. అయితే.. బీజేపీ,ఈసీ కలిసి బిహార్ ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు ‘ఇండియా’ కూటమి అనుమతించదు. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలనూ ఆ పార్టీ తారుమారు చేసింది. కొందరు పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు యత్నిస్తోంది” అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం చోరీ చేసిన ఓట్ల ద్వారానే ఏర్పాటైనట్లు అంతకుముందు రాహుల్ గాంధీ ఆరోపించారు. అటువంటి ప్రభుత్వానికి ప్రజాసేవ చేసే ఉ



ద్దేశం ఉంటుందా? అని ప్రశ్నించారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా యువతతో సమావేశమైన వీడియోను ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేస్తూ.. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు తమ ఓటు శక్తిని వినియోగించాలని పిలుపునిచ్చారు. సరైన ఓటరు జాబితాలే స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు పునాదిగా పేర్కొన్నారు.

# ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడిఅభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శరద్ పవార్ సహా విపక్ష పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్, డీఎంకే తిరుచ్చి శివ, టీఎంసీ నేత శతాబ్ది రాయ్, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, సీపీఐ(ఎం) జాన్ బ్రిటాస్‌లు ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 160 మంది ఎంపీలు ఆయనకు మద్దతుగా సంతకాలు చేసినట్లు సమాచారం.

నామినేషన్ పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రశీదును అందజేశారు. ఈసందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై నిబద్ధత, వినయ భావంతో నామినేషన్ దాఖలు చేస్తున్నానని అన్నారు. తన జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉందన్న ఆయన..ప్రతి వ్యక్తి గౌరవం పైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉందన్నారు.

మరోవైపు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఆగస్టు 20న నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆయనతన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మొత్తంఎలక్టోరల్ కాలేజీ సంఖ్య 781కాగా మెజార్టీ మార్కు391. అధికార పక్షానికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

# నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర,హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్‌పీసీ ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టుకు వివరించారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదని చెప్పారు. కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయంగా భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విలేకరుల సమావేశంలో సీఎం కమిషన్ నివేదిక వివరాలను తెలిపారని అన్నారు. వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారని, కేసీఆర్‌కు మాత్రం నివేదిక కాపీలు ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని కేసీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికితెచ్చారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానానికి వివరించారు. ఇద్దరు పిటిషనర్లు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయటపెట్టారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి విలేకరికి 60 పేజీల నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించడం లేదని సీజే అన్నారు. ప్రాధాన్యందృష్ట్యా విచారణ ఇవాళే కొనసాగించాలని కేసీఆర్‌తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కమిషన్ నివేదికఆధారంగా చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాత చర్యలు తీసుకుంటారా? అని హైకోర్టు ధర్మాసనం.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి సమయం కావాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

# నిర్మలా సీతారామన్ తో భట్టి విక్రమార్క భేటీ



**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలో పార్లమెంట్ లో నిర్మలా సీతారామన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో భట్టితో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి ఉన్నారు. అంతకు ముందు జీఎస్టీ రేట్ రేషనలైజేషన్ సమావేశానికి హాజరైన భట్టి విక్రమార్క రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని వాటాకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షికవృద్ధి రేటు 14శాతంగా ఉండటంతో,వార్షికంగా 14శాతం వృద్ధి కలుగుతుందని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా,దానికి సరైన పరిహార యంత్రాంగం ఉండాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ట్రాన్స్‌జెండర్లకు సర్కార్ బంపర్ ఆఫర్

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు మరో బంపర్ అఫర్ ప్రకటించింది. ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పలు ప్రభుత్వ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లను సెక్యూరిటీ విధుల్లో నియమించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే గత ఎనిమిది నెలలుగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విజయవంతంగా సేవలందిస్తున్న ట్రాన్స్‌జెండర్లను ఇప్పుడు జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, హెచ్‌ఎండీఏలలో సెక్యూరిటీ విధుల్లో నియమించాలని నిర్ణయం తీసుకుంది. అలాగే దశలవారీగా ఐటీ కంపెనీల్లో సెక్యూరిటీ విధుల్లోకి తీసుకునేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ట్రాన్స్‌జెండర్ల నైపుణ్యాలు, విద్యార్హతల ఆధారంగా శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో 25,ఆర్టీసీలో 20ఉద్యోగాలను ట్రాన్స్‌జెండర్ల కోసం గుర్తించారు. ముఖ్యమంత్రి ఆమోదం తర్వాత ఈ పథకం వెంటనే అమలులోకి వస్తుందని



అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక స్థిరత్వం కల్పించడంతో పాటు సమాజంలో గౌరవప్రదమైన ఉపాధిని అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని అధికారులు పేర్కొన్నారు. కాగా ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఆ చర్యలపై ఎల్జీబీటీక్యూ కమ్యూనిటీకి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హర్పాల్ సింగ్..

## ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారుగా లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్ (రిటైర్డ్)ను నియమిస్తూ ఇవాళ సీఎస్ రామకృష్ణ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు హర్పాల్ సింగ్ ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న నీటిపారుదల సారంగ ప్రాజెక్టులలో సమస్యలను పరిష్కరించడం, పనులను వేగవంతం చేయడంతో పాటు ఆయన నైపుణ్యాన్ని, సేవలను నీటి పారుదల, సీఏడీ విభాగంలో వినియోగించుకోనున్నారు. కాగా, జనరల్‌హర్పాల్ సింగ్ భారత సైన్యంలో 40 ఏళ్లకు పైగా పని చేశారు. భారతరక్షణదళాల వ్యూహాత్మక మౌలిక సదుపాయాలలో ఆయన నిష్ణాతుడు. పెద్ద ఎత్తున సివిల్ మౌలిక సదుపాయ ప్రాజెక్టులను మార్గదర్శనం చేయడం, అధునాతన సాంకేతికత, పరిష్కారాలను అమలు చేయడంలో హర్పాల్ సింగ్‌కు అపార అనుభవం ఉంది.

ఇక బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్‌గా, ఇండియన్ ఆర్మీలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా, వ్యూహాత్మక సొరంగాలు, ఇతర భూగర్భ మౌలిక సదుపాయ ఆస్తుల అభివృద్ధిలో హర్పాల్ సింగ్ కీలకపాత్ర పోషించారు. రోహ్‌తాంగ్ పాస్ కింద అటల్ టన్నెల్ పూర్తి, సిక్కింలో థీంగ్ టన్నెల్,




అరుణాచల్ ప్రదేశ్‌లో సెలా, నెచిపు టన్నెల్స్ పురోగతి, దేశ సరిహద్దు పాస్‌ల వెంట అనేక సొరంగాల ప్రణాళికలో కీలక వ్యవహరించారు. అత్యంత సవాలుతో కూడిన హిమాలయ భౌగోళిక పరిస్థితుల్లో ఆయన సివిల్ ఇంజనీర్ అయినప్పటికీ, అమెరికాలో పీజీ కోర్సులు చేసి మౌలిక సదుపాయ అభివృద్ధిలో నైపుణ్యం సంపాదించారు.

ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా,ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) వైస్ చైర్మన్‌గా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జ్ ఇంజనీర్స్ సంస్థకు వైస్ చైర్మన్, కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు.

# రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలి



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర,హైదరాబాద్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, యూరియా సరఫరాపై సమీక్షించారు. గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. భద్రాచలం వద్ద గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. “రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలి. అత్యవసరాన్ని గుర్తించి త్వరగా ఇవ్వాలి. యూరియాను కనీసం చూడని నేతలు కూడా విమర్శలు చేస్తున్నారు. పెద్దపెద్ద మాటలు మాట్లాడి అభాసుపాలు కావద్దు. నన్ను విమర్శించే వారు కేంద్రమంత్రి నడ్డాను అడగవచ్చు. యూరియా సరఫరాపై అన్ని లెక్కలు ఇస్తున్నాను. రామచందర్‌రావు అంటే నాకు గౌరవం. అబద్ధాలు చెప్పి భాజపాను బాగు చేయాలంటే సాధ్యం కాదు.రైతులపై రాజకీయాలు చేసి పార్టీని పెంచుకోలేరు. వాస్తవాలను రామచందర్‌రావు ఒప్పుకోవాలి.యూరియాపై ఎప్పటికప్పుడు లెక్కలు కేంద్రానికి పంపుతున్నాం. నిన్నగాక మొన్న వచ్చిన రామచందర్‌రావు విమర్శలు సరికావు. శవాలపై పేలాలు ఏరుకునేలా భాజపా వ్యవహారం ఉంది. యూరియాపై భాజపా అసత్య ప్రచారం మానుకోవాలి.రామచందర్ రావుకు పలుకుబడి ఉంటే యూరియా తెప్పించాలి. ఆయనకు అంత పలుకుబడి ఉందని నేను అనుకోను. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉంది. యూరియాను దాచుకొని మేం ఏం చేసుకుంటాం? పదేపదే విమర్శలు సరికాదు. బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. యూరియాపై కేంద్ర మంత్రుతు బండి సంజయ్, కిషన్‌రెడ్డితో వ్యక్తిగతం గా మాట్లాడా. కేంద్రాన్ని ఒప్పించి రామచందర్‌రావు.. యూరియా తెప్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తున్నాం. కేంద్రం కూడా సహకరించాలి.” అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# ప్రజాధనం దోపిడీని కచ్చితంగా అడ్డుకుంటాం

**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నీటిని హైదరాబాద్‌కు దగ్గరలోని కొండపోచమ్మ సాగర్‌కు గత ప్రభుత్వం తీసుకొచ్చిందన్న ఆయన.. అక్కడి నుంచి గండిపేట చెరువుకు తరలించడానికి 2022లోనే రూ.1,100 కోట్లతో ఆమోదం తెలిపినట్టు గుర్తు చేశారు. మూసీలోకి చేరే 2000 ఎంఎల్డీ మురుగునీటి శుద్ధి కోసం 36 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర సుందరీకరణ పనులు పూర్తి చేయడంతో పాటు ఉప్పల్ భగాయత్‌లో శిల్పారామాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మూసీ అభివృద్ధి కోసం అన్నీ సిద్ధం చేసిరూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్,డీపీఆర్ తయారుచేస్తే. కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ.1.50 లక్షల కోట్లకు పెంచి దోపిడీకి పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాధనం దోపిడీని కచ్చితంగా అడ్డుకుంటామన్నారు.



# నాపై కుట్రలు ఆపడం లేదు.. - అమెరికా రాగానే పదవి నుంచి తొలగించారు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ అధిష్టానం షాకిచ్చిన విషయం తెలిసిందే. టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షుడి పదవిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అప్పగించారు. ఇన్నాళ్లు ఆ యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవితను కాదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఈ పరిణామంపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

**“అన్నాదమ్ములు, అక్కచెల్లెళ్లెరా..**

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు మీకు సేవ చేసుకునే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పదేళ్లకాలంలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ప్రతి కార్మిక కుటుంబంలో ఒక సోదరిగా మీకు సేవలందించాను. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ ఆఫీస్‌లో ఈ ఎన్నిక నిర్వహించడం సాంకేతికంగా తప్పా ఒప్పా అనే అంశాలను పక్కన పెడితే రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా తెలుస్తోన్నది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా సింగరేణి బొగ్గు గని కార్మికులను ఏకతాటిపైకి తెచ్చి పోరాటంలో భాగస్వామ్యం చేసేందుకు నేను మొదటి నుంచి ముందు వరుసలో ఉండి పని చేశాను. 2015 ఆగస్టు 17వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించిన టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో 11 ఏరియాల నుంచి హాజరైన 1000 మందికి పైగా సభ్యుల సమక్షంలో నన్ను గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అప్పటి టీబీజీకేఎస్ అధ్యక్షుడు కనకరాజు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు రవీందర్ రెడ్డితో పాటు సీనియర్ నాయకుడు కెంగెర్ల మల్లయ్య సహా ముఖ్య నాయకులు అందరూ పాల్గొన్నారు. టీబీజీకేఎస్‌లో జరిగే అన్ని నిర్ణయాలను గౌరవ అధ్యక్షురాలి హోదాలో నేనే తీసుకునేలా తీర్మానం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నేను పోరాడుతుంటే కొందరు నాపై కుట్రలు పన్నుతున్నారు. అలాంటి కుట్రలతో వ్యక్తిగతంగా నాకు వచ్చే నష్టం ఏమీ లేకపోయినా, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న నన్ను తొలగించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కొందరి లక్ష్యంగా కనిపిస్తున్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే పద్ధతిని పక్కన పెడితే కేసీఆర్‌ను ఒప్పించి తిరిగి డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించేలా చేశాను. తద్వారా సింగరేణిలో 19,463 మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించానని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. సకల జనుల సమ్మెతో సింగరేణిలో తట్టాచెమ్మాస్ బంద్ పెట్టి స్వరాష్ట్ర సాధన ఆకాంక్షను ఢిల్లీకి తెలియజేసేలా కృషి చేసిన మన కార్మికులకు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తెలంగాణ ఇంక్రిమెంట్ ఇప్పించాను. కార్మికులు తీసుకునే రూ.10 లక్షలకు పైబడిన హౌసింగ్ లోన్‌పై వడ్డీ చెల్లింపు, కార్మికులు నివసించే క్వార్టర్స్‌కు ఉచిత కరెంట్, ఉచిత ఏసీ సదుపాయం ఇప్పించాను. కార్మికులకు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ పది రెట్లు పెంచేందుకు పాటు పడినాను. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన కార్మిక కుటుంబాల్లోని పిల్లలకు ఫీ రీయింబర్స్ మెంట్ సదుపాయం తీసుకొచ్చాను. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున పూర్తి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయించాను. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు ఆప్షనల్ సెలవు మంజూరు చేయించాను. కార్మిక కుటుంబానికి మాత్రమే పరిమితమైన కార్పొరేట్ వైద్యాన్ని వారి తల్లిదండ్రులకు కల్పింపజేశాను. క్యాడర్ స్కీం, మరణించిన లేదా మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మిక కుటుంబాల్లోని వారసులు మేజర్ అయ్యేంత వరకు ఎంఎంసీ సదుపాయం కల్పించడం సహా కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఎన్నో పథకాలు అమలు చేయడంలో క్రియాశీలంగా పని చేశాను.

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో కొన్నాళ్లుగా జరుగుతోన్న పరిణామాలు మీకందరికీ తెలిసే ఉంటుందని భావిస్తున్నాను. పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగంపై వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను నేను లేఖ రూపంలో తెలియజేశాను. నా తండ్రి కేసీఆర్‌కు నేను గతంలోనూ ఇలాంటివి ఎన్నో లేఖలు రాశాను. నేను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు కేసీఆర్‌కి రాసిన ఆ లేఖను లీక్ చేశారు. ఆ లేఖను లీక్ చేసి నాపై కుట్రలకు పాల్పడుతున్న వారు ఎవరో బయటపెట్టాలని నేను కోరాను. పార్టీలో జరుగుతోన్న వ్యవహారాలను నేను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా నాపై కక్షగట్టారు.


ఆ తర్వాత జరుగుతోన్న పరిణామాలు, ఘటనలు అన్ని మీ మననంలో ఉన్నాయనే అనుకుంటున్నాను. ఆడబిడ్డగా పార్టీ మంచి కోరి రాసిన లేఖను లీక్ చేసిన కుట్రదారులు ఎవరో చెప్పాలని కోరితే నాపైనే కక్షగట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో కార్మిక చట్టాలకు విరుద్ధంగా టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి కొత్త గౌరవ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్టుగా ప్రకటించారు.టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలి పదవిలో ఉన్నా లేకున్నా ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా ఎల్లవేళలా నేను మీ వెన్నంటే ఉంటాను. గడిచిన దశాబ్ద కాలంగా సంఘం గౌరవ అధ్యక్షురాలిగా, అంతకుముందు ఉద్యమ నాయకురాలిగా ఎలాంటి సేవలందించానో ఇకపైనా కార్మికుల కోసం అలాగే పని చేస్తాను. కార్మికులకు ఏ చిన్నకష్టం వచ్చినా మీకు అండదండగా ఉంటాననని మాట ఇస్తున్నాను” అని కల్వకుంట్ల కవిత ప్రకటనలో పేర్కొన్నారు.

## బల్కంపేట రేణుక ఎల్లమ్మకు గాజులతో ప్రత్యేక అలంకరణ



విశ్వంభర, హైదరాబాద్: బల్కంపేట రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని రంగురంగుల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అర్చకులు అమ్మవారికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాజులతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గాజుల అలంకరణలో ఎల్లమ్మను దర్శించుకుంటే పుణ్యంతోపాటు మొక్కులు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

## ప్రాణాలకు తెగించి.. నీళ్లలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ



విశ్వంభర, సిద్దిపేటః సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి కొత్తకుంటలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మరోవైపు ఆపదను లెక్క చేయకుండా విద్యుత్ శాఖ సిబ్బంది సాహసాన్ని ప్రదర్శించి సరఫరాను పునరుద్ధరించారు. 33 కేవీ లైన్‌లో డిస్క్‌లో సమస్య తలెత్తడంతో దౌల్తాబాద్ ఉపకేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదన్న సంకల్పంతో లైన్ మెన్ రాజేశం, అసిస్టెంట్ లైన్‌మెన్లు సుభాశ్, అజయ్, రవీందర్, రాకేశ్, జూనియర్ లైన్‌మెన్ నజీర్ సహా ఇతర సిబ్బంది ప్రాణాలకు తెగించి కుంటలో ఈదుకుంటూ స్తంభం వద్దకు చేరుకున్నారు. కరెంటు స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బంది చేసిన సాహసానికి అధికారులు సహా స్థానిక ప్రజలు వారిని అభినందించారు.


## 81 ఏళ్ల వృద్ధుడిపై హనీట్రాప్.. లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



విశ్వంభర, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల పంజాకు హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు చిక్కాడు. అతడి నుంచి రూ. 7.11 లక్షలను కేటుగాళ్లు కాజేశారు. నగరంలోని అమీర్‌పేట్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. ఆయనతో చనువుగా మాట్లాడుతూ సొమ్మును తస్కరించారు. ఇంకా డబ్బులు అడగటంతో అనుమానం వచ్చిన వృద్ధుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## భావజాల శత్రువు బీజేపీ.. రాజకీయ విరోధి డీఎంకే: నటుడు విజయ్

విశ్వంభర, నేషనల్ బ్యూరోః తమ భావజాల శత్రువు బీజేపీ.. రాజకీయ విరోధి డీఎంకే అని టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీ టీవీకేకి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపును తడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను ఉద్ధృతం చేసిన ఆయన.. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. "కులం కాదు.. మతం కాదు.. తమిళుడికే ప్రాధాన్యం ఇస్తాం. భాజపాతో చేతులు కలిపే ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి? తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తాం. రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ ఢిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది" అని విజయ్ విమర్శలు గుప్పించారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించినప్పటినుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గతేడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో తొలి సభ నిర్వహించారు.



## ముఖ్యమంత్రిపై దాడి వేళ..
# ఢిల్లీ పోలీస్ కమిషనర్ మార్పు




విశ్వంభర, నేషనల్ బ్యూరోః ఢిల్లీ నూతన పోలీస్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సతీశ్ గోల్చా నియమితులయ్యారు. ప్రస్తుత సీపీ శశిభూషణ్ కుమార్ సింగ్ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. సీఎం రేఖా గుప్తాపై దాడి జరిగిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. గోల్చా ప్రస్తుతం ఢిల్లీ డీజీ (జైళ్లు)గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుందని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతుందని హోంశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా.. సంజయ్ అరోరా పదవీ విరమణ నేపథ్యంలో ఆగస్టు 1న ఢిల్లీ సీపీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎస్‌బీకే సింగ్.. హోం గార్డ్స్ డీజీగా కొనసాగనున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న 'జన్ సున్వాయ్' కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు.. పత్రాలను అందిస్తూ సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఢిల్లీలోని వీధి కుక్కలను తరలిస్తున్నారనే కోపంతోనే తాను ఈ దాడికి పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు చెప్పినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

## వీధి కుక్కలను
# తరలిస్తున్నారనే సీఎంపై దాడి!




విశ్వంభర, నేషనల్ బ్యూరోః ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని వీధి కుక్కలను తరలిస్తున్నారనే కోపంతోనే తాను ఢిల్లీ ముఖ్యమంత్రిపై దాడి చేశానని నిందితుడు పోలీసులకు చెప్పినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లుచేస్తున్నామని ఇటీవల ఢిల్లీ సీఎం రేఖాగుప్తా మీడియాకు తెలిపారు. జంతు ప్రేమికుడైన తనను ఈ విషయం ఎంతగానో బాధించడంతో.. ఈ చర్యలను నిలిపివేయాలని అభ్యర్థించడానికి ఆమెను కలిసేందుకు టికెట్ లేకుండా రైల్లో ప్రయాణించి మరీ గుజరాత్ నుంచి ఢిల్లీ వచ్చినట్లు సకారియా తెలిపాడు. ముఖ్యమంత్రిని తన నివాసంలో కలిసి కుక్కల సమస్య గురించి మాట్లాడడానికి ప్రయత్నించగా అది కుదరకపోవడంతో.. 'జన్ సున్వాయ్' కార్యక్రమానికి వెళ్లినట్లు నిందితుడు పేర్కొన్నాడు. సమస్యను రేఖా గుప్తాకు వివరించగా.. తన విజ్ఞప్తిని ఆమె పట్టించుకోకపోవడంతో కోపంతో దాడి చేశానన్నాడు. సకారియా కుక్కల సంరక్షణ సంస్థలతో కలిసి పని చేస్తుంటాడని.. అతడికి మూగజీవాలంటే ఇష్టమని కుటుంబసభ్యులు వెల్లడించినట్లు జాతీయమీడియా వర్గాలు పేర్కొన్నాయి. కుక్కలను షెల్టర్లకు తరలించాలని కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో అతడు తీవ్ర నిరాశకు గురయినట్లు చెప్పినట్లు తెలిపాయి. అయితే నిందితుడి వాదనను ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రా కొట్టిపడేశారు. నిందితుడు ఉద్దేశపూర్వకంగానే, ప్లాన్ ప్రకారమే దాడి చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. రేఖా గుప్తా నివాసం వద్ద అతడు తచ్చాడిన వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఊహించనివిధంగా తనపై జరిగిన దాడితో ఢిల్లీ ముఖ్యమంత్రి షాక్‌లో ఉన్నారని కపిల్ మిశ్రా అన్నారు. గాయాలైనప్పటికీ ఆమె ఇంటి పని చేస్తున్నారన్నారు. రేఖాగుప్తాకు 'జడ్' కేటగిరీ భద్రత..తాజాగా జరిగిన దాడి నేపథ్యంలో రేఖా గుప్తాకు ముప్పు పొంచి ఉండడంతో ఆమెకు 'జడ్' కేటగిరి భద్రతను కల్పిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 40-45 మంది సిబ్బంది సీఎంకు రక్షణ కల్పించే విధుల్లో ఉంటారు.

## కేరళ పాఠశాల బయట
# ప్రమాదకర పేలుడు పదార్థాలు లభ్యం



విశ్వంభర, నేషనల్ బ్యూరోః కేరళలోని ఓ పాఠశాల బయట ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు కలకలం రేపాయి. వాటిల్లో ఒకదాన్ని ఓ విద్యార్థి విసిరేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పాలక్కాడ్ జిల్లా వడకంధరలోని ఓ పాఠశాల బయట బుధవారం సాయంత్రం ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు కన్పించాయి. నారాయన్ (10) అనే విద్యార్థి ఆడుకుంటూ బయటకు వచ్చి.. పేలుడు పదార్థాలను చూశాడు. వాటిల్లో ఒకదాన్ని విసిరేయగా.. పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో విద్యార్థితో పాటు మరో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాలలోని సిబ్బంది, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించగా.. మరో నాలుగు పేలుడు పదార్థాలను కనుగొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇవి చాలా ప్రమాదకరమైనవని, కావాలనే వాటిని ఎవరో అక్కడ ఉంచారని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. పేలుడు పదార్థాలు అక్కడ ఎవరు ఉంచారనే విషయం తెలుసుకునేందుకు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై బీజేపీ జిల్లా నాయకులు స్పందిస్తూ.. దీనివెనక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. పాఠశాల యాజమాన్యానికి, ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉందని, ఆ ప్రాంతంలోని వాలంటీర్లకు శిక్షణ కూడా ఇస్తుందని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. ఈ పేలుడు పదార్థాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నాయకులు కూడా కోరారు.

# సరిహద్దుపై నేపాల్ అభ్యంతరం.. ఖండించిన భారత్




విశ్వంభర, నేషనల్ బ్యూరోః భారత్- చైనాల మధ్య వివాదాలు పరిష్కరించుకునే దిశగా ఇరుదేశాలు అడుగులు వేస్తున్నాయి. ఈక్రమంలో లిపులేఖ్ ప్రాంతం మీదుగా వాణిజ్య సరిహద్దులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలిపింది. కాగా, భారత విదేశాంగ శాఖ దీనిపై స్పందిస్తూ ఈవిషయంలో నేపాల్ వాదనలు అసమగ్రంగా ఉన్నాయని స్పష్టంచేసింది. మహాకాళి నదికి తూర్పున ఉన్న లింపియాధుర, లిపులేఖ్, కాలాపాణిలు తమ దేశంలో భాగమని నేపాల్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి పేర్కొన్నారు. తమ మ్యాప్‌లోను ఇదే స్పష్టమవుతుందని వాదించారు. ఇప్పటికే ఈవిషయాన్ని చైనా ప్రభుత్వానికి కూడా తెలియజేశామన్నారు. భారత్-నేపాల్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్యను దౌత్యపరమైన చర్చలతో పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నేపాల్ వాదనలపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి జైశ్వాల్ తీవ్రంగా స్పందించారు. 'లిపులేఖ్ ద్వారా భారత్- చైనాల మధ్య సరిహద్దు వాణిజ్యం తిరిగి ప్రారంభించడంపై నేపాల్ అభ్యంతరం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈవిషయంలో మా వైఖరి స్థిరంగా, చాలా స్పష్టంగా ఉంది. లిపులేఖ్ ద్వారా మా వాణిజ్యం 1954లో ప్రారంభమై.. కొన్ని దశాబ్దాల పాటు సాగింది. ఆ తర్వాత పలు కారణాల వల్ల ఇటీవల దానికి అంతరాయం కలిగింది. ఇప్పుడు తిరిగి దాన్ని ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి' అని పేర్కొన్నారు. నేపాల్ ప్రాదేశిక వాదనలను సమర్థించలేమన్నారు. దాని వాదనలపై ఎలాంటి చరిత్రాత్మక ఆధారాలు లేవన్నారు. కృత్రిమంగా చేపట్టిన సరిహద్దు మార్పులను తాము అంగీకరించబోమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. వివాదాల పరిష్కారం కోసం చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లతో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపారు. అనంతరం లిపులేఖ్, షిప్కి లా, నాథు లా మార్గాల ద్వారా వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాలని, ఇందుకు ఇరుదేశాలు అంగీకరించాయంటూ ఓ ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. లిపులేఖ్, కాలాపానీ, లింపుయాదురా ప్రాంతాలను తమ భూభాగాలుగా పేర్కొంటూ నేపాల్ 2020లో సరికొత్త మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. నాటి కేపీ శర్మ వోలీ ప్రభుత్వం దీనిపై తీర్మానం చేయడంతో పాటు.. పార్లమెంటులో ఆమోదముద్ర కూడా వేసింది. అయితే భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. నేపాల్ వాటిని బేఖాతరు చేసింది.

## బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదు.. అవసరం: కర్ణాటక హైకోర్టు



విశ్వంభర, నేషనల్ బ్యూరోః రాష్ట్ర ప్రభుత్వం బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడాన్ని కర్ణాటక హైకోర్టుతప్పుబట్టింది. బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదని.. నగర ప్రజలకు అది అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభు బఖ్రు నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. మధ్యతరగతి ప్రజలకు బైక్‌ట్యాక్సీలు ఎంతో ఉపయోగకరమైనవని.. దేశంలోని దాదాపు 13 రాష్ట్రాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని వ్యాఖ్యానించింది. మోటారు వాహనాల చట్టం బైక్ ట్యాక్సీలను నిషేధిస్తుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడం వల్ల వాటిపైనే ఆధారపడిన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడతాయని.. ప్రజల జీవనోపాధి హక్కును పూర్తిగా హరించే అధికారం ఎవరికీ ఉండదని ఆగ్రహం వ్యక్తంచేసింది. బైక్ ట్యాక్సీలను మినహాయించడానికి రాష్ట్రం ఉద్దేశపూర్వకంగా విధాన వైఖరిని తీసుకుందా అని కోర్టు ప్రశ్నించింది. బైక్ ట్యాక్సీ డ్రైవర్లపై ప్రస్తుతానికి ఎటువంటి బలవంతపు లేదా శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా చూసుకోవాలని అడ్వకేట్ జనరల్‌ను న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 22కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేయాలని సూచించింది. కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్లు 'బైక్స్ ట్యాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రకటించింది. చట్టబద్ధమైన, సురక్షిత కార్యకలాపాలను కొనసాగించడానికి తాము ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.

## పావురంతో మందుపాతర పేలుడు బెదిరింపు.. జమ్మూలో హై అలర్ట్



విశ్వంభర, నేషనల్ బ్యూరోః భారత్- పాక్ సరిహద్దు సమీపంలో ఓ పావురం కలకలం రేపింది. మందుపాతరను పేల్చేస్తామంటూ దాని కాలుకి బెదిరింపు సందేశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జమ్మూలోని పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అసలేం జరిగిందంటే.. ఆర్‌ఎస్ పురాలోని ఖాట్మారియన్ ప్రాంతంలో సరిహద్దు భద్రతా దళం అధికారులు ఓ పావురాన్ని పట్టుకున్నారు. దాని కాలుకి ఉర్దూ, ఆంగ్లంలో ఓ సందేశం ఉంది. 'కశ్మీర్ మాది. సమయం వచ్చింది. అది వస్తుంది' అని ఉర్దూలో, 'జమ్మూస్టేషన్ ఐఈడీ బ్లాస్ట్' అని ఆంగ్లంలో రాసి ఉంది. దీంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. జమ్మూకశ్మీర్ పోలీసులకు దీనిపై సమాచారం ఇచ్చారు. వెంటనే జమ్మూ రైల్వేస్టేషన్ సహా పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక, ఈ పావురం ఇక్కడికి ఎలా వచ్చిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.


## పీపీపీ ద్వారా వాహనాలు సమకూరిస్తే మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం: సీవీ ఆనంద్

విశ్వంభర, హైదరాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్ని వాహనాలు ఇచ్చినా పోలీస్‌శాఖకు సరిపోవని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. అందుకే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా వాహనాలను కేటాయిస్తే ఇంకా మెరుగ్గా సర్వీసులు అందించగలుగుతామన్నారు. హైదరాబాద్‌లో 650 జంక్షన్‌లు ఉన్నాయని.. రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోందని చెప్పారు. నగరంలో సగటువేగం 18కి.మీ నుంచి 23కి.మీకి పెరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్‌లో నియమించామన్నారు. "ట్రాఫిక్ మార్షల్స్ సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్సైల పర్యవేక్షణలో పని చేస్తారు. చాలా ఆలోచించిన తర్వాతే ట్రాఫిక్ సిబ్బందికి డ్రెస్‌లు ఇచ్చాం. రాబోయే రోజుల్లో 500 మంది వరకు ట్రాఫిక్ మార్షల్స్ పెరుగుతారని అనుకుంటున్నాం. వీళ్లంతా చాలా బాధ్యతగా వ్యవహరించాలి. ట్రాఫిక్ విభాగానికి, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లకు డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేశాం. బైక్ నడుపుతున్న వారికి బాడీవేర్ కెమెరా ఉంటుంది." అని సీపీ వివరించారు.

## రాచకొండ సీపీ ఎదుట లొంగిపోయిన సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు

విశ్వంభర, హైదరాబాద్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట ఇద్దరు సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు కాకరాల సునీత సీపీ ఎదుట లొంగిపోయారు. ఆమె తండ్రి, ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలును సీపీ వెల్లడించారు. "వరవరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వారి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారు. ఆమె 1986లో పీపుల్స్ వార్ పార్టీలో ఉన్నారు. 1986 ఆగస్టులో టీఎల్ఎన్ చలం గౌతమ్ అలియాస్ సుధాకర్‌ను వివాహం చేసుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1992లో నల్లమల అడవుల్లోకి వెళ్లారు. 2001లో ఏవోబీ ప్రాంతానికి, 2006లో దండకారణ్యానికి బదిలీ అయ్యారు. చెన్నూరి హరీశ్ అలియాస్ రమణ కూడా నేడు లొంగిపోయారు. ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడు ఏటూరునాగారం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మావోయిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. 2024లో ఏసీఎంగా పనిచేశారు. వీరిద్దరూ ఎన్నో ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నారు. జనజీవన స్రవంతిలో పాల్గొనడం మంచి పరిణామం" అని సీపీ తెలిపారు.

# ఒక వైవిధ్యమైన నాటకీయ రూపం ప్రహసనం



"ప్రహసనం" అనేది తెలుగులో ఒక సాహిత్య ప్రక్రియ లేదా నాటక రూపం, దీనిలో హాస్యం, అతిశయోక్తి, మరియు అసంబద్ధమైన పరిస్థితులు ఉంటాయి. ఇది తరచుగా "ఫార్స్" లేదా "సాటిరికల్ కామెడీ" అని పిలువబడే పాశ్చాత్య సాహిత్య ప్రక్రియకు సమానంగా ఉంటుంది. తెలుగు సాహిత్యంలో "ప్రహసనం" అనేది ఒక వైవిధ్యమైన నాటకీయ రూపం. ప్రహసనంలో ప్రధానంగా హాస్యం , అతిశయోక్తి ఉంటాయి. పాత్రలు, పరిస్థితులు మరియు సంభాషణలు సాధారణం కంటే ఎక్కువ చేసి చూపించబడతాయి, తద్వారా ప్రేక్షకులకు నవ్వు పుట్టించబ డుతుంది. హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, అధిక్షేపాన్ని ప్రధానంగా కలిగిన నాటిక కావడం చేత 'ప్రహసనం' పదానికి అర్థం పెద్ద నవ్వును ప్రేరేపించేది అనే భావనలో ఉంది. ఇది సాధారణంగా కల్పిత సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటుం ది.ఆధునిక కాలంలో కూడా "ప్రహసనం" అనే పదం ఉపయోగించబడుతుంది. ఏదైనా పరిస్థితి హాస్యాస్పదం గా లేదా అర్థంలేనిదిగా మారినప్పుడు దానిని ప్రహసనం అని అంటారు

**అసంబద్ధమైన, ఊహించలేని సంఘటనలు..**

ప్రహసనాలలో తరచుగా అసంబద్ధమైన, ఊహించలేని సంఘటనలు చోటు చేసుకుం టాయి. ఇవి సాధారణంగా హాస్యాస్పదంగా వినోదాత్మకంగా ఉంటాయి. ప్రహసనాలలో వస్తువు ఎక్కువగా ఆక్షేప ప్రతిక్షేపానికి దోహదపడుతుంది. ఇదే కారణంగా తెలుగులో ప్రహసనాలు రాసే సాహసికులు కొద్దిమంది మాత్రమే బయటపడతారు. చాలామంది భావ ప్రకటనలో, హాస్యాన్ని, వ్యంగ్యాన్ని చెప్పడంలో, ఆ చివరిలో లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పడంలో కొంత చికాకుగా వస్తుం ది."ప్రహసనం"లో హాస్యం యొక్క సంకల్పం, దాని అన్వయం, విషయాల ఎంపిక విధానం ప్రత్యేకంగా ఉంది. హాస్యాన్ని సాధించడంలో రచయిత సాహిత్య వస్తువు వైవిధ్యాన్ని, పదాల వడపోతను చూపించాల్సి ఉంటుంది.ప్రహసనం గ్రంథరచనలో, హాస్యాన్ని వ్యంగ్యంగా, అధిక్షేపంగా, వ్యాసంగా, సంఘటన రూపంగా సాహసికంగా ఉపయోగించటం ప్రక్రియ గొప్పదనం. ( పరమేశ్వర రావుబీ వ్యాసం – "తెలుగు సాహిత్యంలో ప్రహసన రంగం", సాహిత్య మానస పత్రిక, 1995) ప్రహసనాల్లో 'సామాజిక అంశాలపై', 'రాజకీయ వ్యంగ్యం' ముఖ్యమైన ఇతివృత్తాలు. ఈ తరహా రచనల్లో పాత్రలు ఒకరిద్దరు మాత్రమే ఉంటారు. వాళ్ల మాటలలో హాస్యం, వ్యంగ్యం, అధికారాన్ని అన్నివిధాల చూపెడతారు.


**50కిపైగా కందుకూరి ప్రహసన రచనలు..**

కందుకూరి వీరేశలింగం తెలుగు సాహిత్యంలో ప్రహసన (నాటక ప్రక్రియలో హాస్యాత్మక శైలిలో కోరిక, విమర్శ, సందేశాన్ని ప్రతిబింబించే రకం) వ్యవహారానికి ఆద్యుడు గాగా నిలిచారు. ఆయన సృష్టించిన ప్రహసనములు సాంఘికరంగంలో మర్చిపోయిన లోపాలు నాటకీయంగా ఎత్తి చూపడం ద్వారా ప్రజలను మెలకువకి తీసుకొచ్చాయి. వీరి తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహం కొనసాగించారు. .వీరేశ లింగం సాహిత్యంలో దాదాపు 50కి పైగా ప్రహసన రచనలు ఉన్నాయి. వాటివల్ల సాంఘిక, న్యాయసంబంధ సమస్యలకు, చరిత్రాపరమైన ఘటనలకు ప్రాథమిక విశ్లేషణ లభించింది. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు కూడా సుమారు 40 ప్రహ సనములు వ్రాశారు. ఇతర ప్రసిద్ధ రచయితలలో పానుగంటి, భమిడిపాటి, తిరుపతి, వేదంవారు, కోలాచలం వంటి వారు కూడా ప్రహసన రచనల ద్వారా తమ ఆలోచనలు, సామాజిక విమర్శను వ్యక్తపరిచారు. తెలుగులో తొలి ప్రహసనం అంటే 1876లో కందుకూరి వీరేశలింగం వ్రాసిన "బ్రహ్మవివాహం" అని గుర్తించబడింది. ఇది 1878లో ప్రచురించారు. ఈ ప్రహసనం వృద్ధుడు పెద్దయ్య తనకు చిన్నమ్మ అనే పసిబాలికను పెళ్లి చేసుకోవడానికి ఏర్పాట్లనే చూపారు. ఇందులో బాల్యవివాహం అనే నాటి సాంఘిక దురాచారం తీవ్రంగా ఖండించబడింది. అందువలన ఈ ప్రహసనానికి "పెద్దయ్య గారి పెండ్లి" అనే మారుపేరు కూడా ప్రసిద్ధి చెందింది. అలాగే, 1879లో వీరేశలింగం గారు "వ్యవహార బోధిని", "ప్లీడర్ నాటకం" , "స్త్రీ పునర్వివాహం" వంటి ప్రహసనాలు కూడా రాశారు . ఇవి సాంఘిక, న్యాయ వ్యవహారాల సమస్యలను సున్నితంగా, హాస్యమూర్తిలో ప్రజలకు తెలియజేసే ప్రయత్నాలుగా నిలిచాయి.కందుకూరి వీరేశలింగం సాహిత్య సంపద తెలుగు భాషా సాంస్కృతిక పరిణామంలో పెద్ద చరిత్ర కలిగినది అని చెప్పవచ్చు. ఆయన రచనలు అప్పటి సమాజంలో సమాజ బద్ధత, అన్యాయాలను విమర్శిస్తూ అవగాహన పెంచుతున్న శక్తివంతమైన సాహిత్యమై ఉంటాయి.ఈ క్రమంలో, తర్వాతి తరాల రచయితలు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, వేగంగా అభివృద్ధి పరచారు.కందుకూరి వీరేశలింగం ప్రహసన రచనలో ఒక విశిష్ట లక్షణం అంటే, సమాజంలోని సాంఘిక లోపాలకు పరోక్షం కాకుండా ప్రత్యక్ష వ్యంగ్యాన్ని, విమర్శను రచనా ధోరణిగా అవలంబించడం. ఆయనను తెలుగులో ప్రహసన కర్తగా మాత్రమే కాకుండా, సమాజాన్ని ప్రతిబింబించే ఒక హాస్య విమర్శకుడిగా చూడవచ్చు.

వీరేశలింగం ప్రహసనల్లో వచ్చిన కొన్ని ముఖ్య సాంఘీక సమస్యలు చూస్తే వినోద తరంగిణి ప్రహసనలో వృద్ధ వివాహం వల్ల దెబ్బతినే వ్యక్తిగత కుటుంబస్థితిగతులు, సమాజానికై కలిగే ప్రతికూల ప్రభావాలపై నిలదీసి, ఈ అలవాటును వ్యంగ్య కణం వదిలి ప్రజలపై విమర్శించారు. భ్రాంతి తరంగిణి లో స్త్రీ విద్యపై ఉన్న జాత్యంతర ఆశయాల, వ్యవహారాల, మరియు వ్యభిచారం నిషేధంపై ఒకరకమైన కౌతుక వాదనతో, సమాజంలోని ఆడపడుచుల ప్రగతిని అడ్డుకునే కురుపు లక్షణాలను బ్రహద్వ్యంగ్య రూపంలో చూపించారు.మునిసిఫల్ ప్రహసణం లో నగర జీవితంలో పెరిగిన అవినీతిని, ముఖ్యంగా లంచం వంటి అవినీతిని మన స్ఫూర్తిగా విమర్శించి, ప్రజలకు పరిష్కార మార్గాలను సూచించారు. కన్యాశుల్కం ప్రహసనం బాల్య వివాహానికి అనుబంధంగా ఉన్న కన్యాశుల్కం దుర్వినియోగాన్ని పటిష్టంగా విరోధించిన ప్రహసనం, యోగాభ్యాసము ప్రహసనలో, వర్గసామాజిక వ్యవస్థలోని కుల సంప్రదాయాలు మరియు వాటి దుర్వినియోగాలపై అత్యంత అపద్రోహాత్మక విమర్శ, కులవివక్ష, ఆచార మోసం వంటి అంశాలపై సమగ్ర విశ్లేషణ కనిపిస్తుంది. వీరేశలింగం ప్రహసనాల్లో ఒక ప్రధాన ప్రత్యేకత ఏమిటంటే, ఆయన పాత కథలు, పురాణాలు, మహాభారత, పంచతంత్రం వంటి అందరికి తెలుసు కానీ ప్రేరణాత్మకమైన ఇతివృత్తాలను ఆధారంగా తీసుకుని మళ్లీ వాటిని సాంఘిక సందేశాలతో నూతనతగా రచించారు. ఉదాహరణకు "తిర్యగ్విద్వన్మ మహాసభ" (1889).ఇందులో మృగాలు, పక్షులు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరిస్తూ, మహాభారతంలోని "నక్కదేగ సంభాషణ" ఆధారంగా సమాజాన్ని తలచేలా చేసిన ఒక శాఖాబద్ధమైన ప్రహసనం. ఈ నాటకంలో మను వివేచన, జాతి, వర్గ సమస్యలపై తీవ్ర సూచనలు ఉంటాయి.పంచతంత్ర కథల ఆధారంగా రాసిన "ముషికాసుర విజయం", "మహారణ్య పురాధిపత్యం" వంటి ప్రహసనాలు, నైతిక విలువలు, అన్యాయాలకు వ్యతిరేకంగా సందేశాలను అందిస్తాయి. ఇక్కడ పంచతంత్ర కథలు సామాజిక పరిస్థితులకి అన్వయం చేయడం వల్ల ప్రజలలో అవగాహన పెరుగుతుంది.మొత్తం గా వీరేశలింగం రచనలు రెండు ప్రధాన రకాలు. వాటిలో మొదటిది ఆంగ్లానువాదాలు.ప్రపంచ సాహిత్యంలోని అపూర్వ, చైతన్యవంతమైన ప్రసిద్ధ రచనలను అనువదించి, పాక్షికంగా భారతీయ సందర్భంలోకి తేవడం. ఉదాహరణకు అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం, విచిత్ర వివాదం ప్రహసనం,మహాబధిర ప్రహసనం, పునర్మరణ ప్రహసనం. రెండవది స్వకపోత కల్పితాలు: స్వంత సృజనాత్మకతతో, శైలి నిర్మాణంతో, సాంఘిక దురాచారాలపై సంబంధించిన హాస్య ప్రహసనాలు. ఉదాహరణకు వేశ్యాప్రియ ప్రహసనం, వినోద తరంగిణి, కలి పురుష శనైశ్చర ప్రహసనం, పెండ్లి తరువాత పెండ్లి,తేలు మందు,బహుభార్యత్వ ప్రహసనం.ఈ ప్రహసనాలు సాంఘిక దురాచారాలు, బాల్య వివాహం, అవినీతులు, మానవ సంబంధ విగ్రహాలు వంటి కీలక అంశాలను ఎక్కుపెడుతాయని చెప్పవచ్చు.ఈ విధంగా వీరేశలింగం ప్రహసనాలు సమాజ దోషాలను హాస్య రూపంలో చాటుతూ, ప్రజాస్వామ్య మార్గదర్శకత్వానికి దారి చూపించడంలో కీలక పాత్ర పోషించాయి. ఆయన రచయితగా మాత్రమే కాకుండా సమాజ విమర్శకుడిగా కూడా అగ్రస్థానం సంపాదించుకున్నారు.కందుకూరి ప్రహసనాలపై పలు ప్రధాన పరిశోధనలు జరిగాయి. అవి కందుకూరి ప్రహసనాలు" (1987, ఓయూ) – కె. భీమయ్య ప్రతిపాదించిన ఈ పరిశోధన కందుకూరి రచించిన ప్రహసనాల సారాంశం, నిర్మాణ లక్షణాలు, హాస్య వైవిధ్యాలను విశ్లేషిస్తుంది. ఆయన రచనా శైలిలో ఉన్న ప్రత్యేకతలను గూర్చి క్షుణ్ణతతో పరిశీలించారు. "కందుకూరి ప్రహసనాలలో సాంఘిక దృక్పథం" (1981, కె.యూ) – లోకాంబి. దీనిలో కందుకూరి ప్రహసనాల్లో సంగీత అంశాలు, వాటి ప్రక్రియలు, ప్రదర్శన వ్యవస్థలను అధ్యయనం చేశారు. హాస్యం, వ్యంగ్యంతో కూడిన సంగీత రీతులను వివరించారు. "వీరేశలింగం కావ్య ప్రహసనాలలో హాస్యం" (1990, నాగార్జున యూనివర్సిటీ) – పి. సాంబశివరావు రచనలో, వీరేశలింగం యొక్క కావ్య ప్రహసనాల్లో హాస్యం ఎలా వ్యక్తమవుతుందో, ఇతని హాస్య విధానాలు, పాత్రలనూ విశ్లేషించారు."కందుకూరి ప్రహసనము – బ్రహ్మవివాహం" (1995, ఏయూ) – పి. శాంతమ్మ.ఈ పత్రంలో కందుకూరి "బ్రహ్మవివాహం" ప్రహసనాన్ని పరిపూర్ణ విశ్లేషణతో సమీక్షించారు. సంఘటన ప్రతిపాదన, పాత్రల సహజతపరమైన చర్చలు అందించారు."బ్రహ్మవివాహం – కన్యాశుల్కం తూలనాత్మక పరిశీలన" (1988, హెచ్సీయూ) – జి. పద్మావతి రచనలో రెండు ప్రముఖ ప్రహసనాల తులనాత్మక అధ్యయనం చేసి భిన్న సాంఘిక, సాంస్కృతిక అంశాలను, రచనా శైలుల తేడాలను వివరించారు.ఈ పరిశోధనలు కందుకూరి ప్రహసనాల హాస్య, సంగీత, సామాజిక నేపథ్యాలపై లోతైన అవగాహనను అందిస్తాయి.

**కందుకూరిని అనుసరించిన చిలకమర్తి...**

కందుకూరి తర్వాత తెలుగులో ఎక్కువ ప్రహసనాలు రాసిన ప్రముఖులు చిలకమర్తి. వీరి రచనల్లో స్పష్టంగా కనబడే విషయం ఏమిటంటే, ఆయన కందుకూరి ఆధారంగా ప్రహసన శైలిని అనుసరించారుఈ ప్రయత్నం కందుకూరి ప్రహసనాల శీర్షికలతో పాటుగా, కథా అంశాల పరిధిలోని సమానత్వంలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు, కొన్ని ప్రహసన శీర్షికల మధ్య ఈ అనుసరణలు చూస్తే.మహాబధిర ప్రహసనం తో పోల్చితే బధిర చతుష్టయం, బలత్కార గాన వినోద ప్రహసనం తో సమానమైన శీర్షికగా బలవంత బ్రహ్మణత్వ ప్రహసనం,విచిత్ర వివాహం (1886) ను పోలి విచిత్ర గోదానం,అపూర్వ బ్రహ్మచార్య ప్రహసనం కి ప్రతిధ్వనిగా అపూర్వ నరక ప్రహసనం, ప్లీడర్ నాటకం తో పోల్చి ప్లీడర్ తమాషా, జమా బంధీ కి ప్రత్యామ్నాయం జనాభా లెక్కలు, వినోద తరంగిణి తో పాటు వినోదం, పెద్దయ్యగారి పెండ్లి తో పోల్చితే పెండ్లి కొడుకుల లక్షణాలు.ఈ శీర్షికలు, సరైన వివరణ, పాత్రల నిర్మాణం, హాస్యత్వ లక్షణాలు, సామాజిక సందర్భాలు మరియు వ్యంగ్య పద్ధతుల్లో ఉన్నాయి.ఈ విధంగా చిలకమర్తి ప్రహసన రచనా శైలి కందుకూరి దిశానిర్దేశం ప్రకారం ఉండటమే కాకుండా, అందులో సొంత సృజనాత్మకతను కూడా ఉందని చెప్పవచ్చు.చిలకమర్తి రాసిన ప్రహసనాలు, కందుకూరి గారి ప్రహసనాలతో పోల్చితే హాస్యం, వ్యంగ్యపూరితతలో మరింత పదును తేలినవి. ఉదాహరణకు, చిలకమర్తి యొక్క బధిర చతుష్టయంలో చెవిటి భార్యభర్తల మధ్య సంభాషణలు సృష్టించే సహజమైన హాస్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. అలాగే, శ్రీరామనవమి పందిరిలో డబ్బులతో సంబంధించి ప్రదర్శించే హాస్యం, యమధర్మరాజు కచేరిలో చిత్రగుప్తుడు, యమధర్మరాజు సంభాషణలో రాజకీయ నాయకుల అవినీతిపై పిచ్చి వ్యంగ్యం మరింత స్పష్టంగా ఉంటాయి. కైలాసదూత ప్రహసనంలో మూఢనమ్మకపు అంశాలను కవిత్వాత్మకంగా, వ్యంగ్యాత్మక హాస్యం రూపంలో చూపించడం, చిలకమర్తి హాస్యకళలో ఉన్న లోతును సూచిస్తుంది. ఇక, చిలకమర్తి ప్రహసనాలు కందుకూరి రచనల తరహా సంస్కరణాత్మక భావాలను కూడా ముందుకు తెచ్చాయి. ఉదాహరణకు, అపూర్వ స్వయంవరంలో బాల్య వివాహాలపై విశేష నిరసన, ప్లీడర్ తమాషాలో లాయర్ల అవినీతి, కనకయ్యకంతిలో లాయర్ల నీతిమాలిన్యంపై విమర్శ, పడకగది ముచ్చట్లులో యువతరంలో సంఘ సంస్కరణల కోరత వంటి సామాజిక, సాంస్కృతిక అంశాలను చిలకమర్తి తన ప్రహసనలలో ప్రతిబింబంచేశారు.చిలకమర్తి సుమారు 40కి పైగా ప్రహసనాలు రచించారు. వాటిలో ముఖ్యమైనవి కలిగీత,చాకలి పురాణం,గోటాలమ్మ తాఖీదు,సప్తగ్రమకూటము,ఆకాశ విశ్వవిద్యాలయం, మార్కండేయ స్వామివారి మనవి.ఈ రచనలు హాస్యం, వ్యంగ్యం, సామాజిక రూపాంతర అంశాల్లో విస్తృత పరిశోధనలకు వాతావరణాన్ని కల్పిస్తాయి. అలాగే, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి ప్రహసనాలపై చేసిన ప్రముఖ పరిశోధన "చిలకమర్తి ప్రహసనాలు" (1983, ఏయూ) రచయిత యస్. విజయ్ కుమార్ చేయడం గమనార్హం. తెలుగు సాహిత్యంలో కందుకూరి, చిలకమర్తి వంటి ప్రముఖ ప్రహసన రచయితల వారికే పరిమితమవకుండా, ఇతర రచయితలు కూడా విశేష ప్రహసన రచనలు సమకూర్చారు. ఈ రచనలు హాస్యం, వ్యంగ్యం, సమాజ నేపథ్యం, రాజకీయ అంశాల వివిధ కోణాల ప్రతిబింబాలుగా నిలిచాయి. పానుగంటి లక్ష్మీనరసింహం ప్రహసనాలు ప్రత్యేకమైన శైలితో ముద్రపడ్డాయి. ఆయన రచనలు సామాజిక సమస్యలను హాస్యము ద్వారా మర్యాదగా ముందు కు తెచ్చాయి.అలాగే, విధిలేక వైద్యుడు, కంఠాభరణం, లుబ్ధాగ్రేసర చక్రవర్తి, భమిడిపాటి కామేశ్వరరావు రచనలు – "ఈడు జోడూ," "పెళ్లికంట్రోల్," "వద్దంటే పెళ్లి," "ఐదారోజులు" వంటివి పలు వైవిధ్యాలను ప్రదర్శిస్తాయి. వీరి రచనలు గమనిస్తే, సాంఘిక ఆవశ్యకతలను, కుటుంబ సంబంధాలను, వివాహ సంస్కృతిని హాస్యంతో, వ్యంగ్యంతో చురుకుగా ప్రతిబింబిస్తాయి. కొలాచలం శ్రీనివాసరావు "ఆచారమ్మ కథ," "నాచీపార్టీ," "అన్యాయ ధర్మపురి మహిమ" వంటి ప్రహసనాలను సృష్టించి, సమాజ వ్యంగ్యం మరియు ధార్మిక ఆచారాలపై విమర్శలు చేశారు. ఆయన రచనలు సమాజంలోని లోపాలను హాస్యంతో వెలుగుచేసే విధంగా ఉన్నాయి. తిరుపతి వెంకట కవులు వ్రాసిన "వల్లెటూళ్ల పట్టుదలలో" ప్రహసనం సాంప్రదాయ, గ్రామీ? జీవనవిధానాలపై దృష్టిపెడుతుంది. కాళ్లకూరి నారాయణరావు రచనలు "మధునాయక కార్తవీర్య," "ఘోరకలి ప్రహసనం," "కారణంలేని కంగారు," "రూపాయి గమ్మత్తు," "విదూషక కపటం" మరియు "మునిసిపల్ ముచ్చట్లు" దీర్ఘ కథా నాయకత్వాన్ని, సామాజిక వ్యాసాంతరాలను హాస్య రూపంలో చూపిస్తాయి. అలాగే, వేదం వెంకటరాయ శాస్త్రి "స్త్రీ పునర్వివాహం దుర్విధ నిరూపణ" ప్రహసనం, యం.యస్. చౌదరి గారి "మనోహరం," "నేటి భారతం," "నేటి కన్యాశుల్కం," మరియు "ఏకలవ్య రానున్నది" రచనలు సమకాలీన సమాజ సమస్యలను హాస్య, వ్యంగ్య మేళవింపుతో సమీక్షించాయి. ఇవి కాకుండా, "ప్రళయమే ఓ మనసా నీ విలువెంత" వంటి ప్రహసనాలు హృదయ భావోద్వేగాలతో, సామాజిక విలువల పరిరక్షణకు దారితీ స్తాయి.ఈ వివిధ రచనలు తెలుగులో ప్రహసన క్రాంతికి విస్తీర్ణ వైవిధ్యాన్ని అందిస్తున్నాయి. తమ సామాజిక అవగాహన, సాంఘిక విమర్శను హాస్యం, వ్యంగ్యం రూపంలో సమర్థంగా పాఠకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రతి రచనలోని హాస్య, వ్యంగ్య భావాలు, పాత్రల విజ్ఞానం, సంఘటనల నిర్మాణం, కాలానుగుణ సామాజిక నేపథ్యం అంశాలు పరిశోధనలకు ఉపయోగకరంగా ఉన్నాయి.



దశ రూపాకాలలో నాలుగవ రూపకము ప్రహసనము..

తెలుగు సాహిత్యంలో "ప్రహసనం" అనేది దశరూప భేదాలలో ఒక ముఖ్యమైనది, కానీ పరిమిత సంఖ్యలో వెలువడిన నాటక రూపం. దీనిని సంస్కృతంలో బోధాయనుడు రాసిన "భగవత నాటకం" మరియు మహేంద్రవర్మ రచించిన "మత్త విలాసం" వంటి ప్రహసనాలతో పోల్చవచ్చు. ఈ ప్రహసనాలు సాధారణంగా సాంప్రదాయికృత అభివృద్ధిలో తక్కువ వాసి, ఎక్కువ రాశి కలిగి ఉంటాయి. ఆంగ్ల సాహిత్యంలో ఈ విధంగా సంఘటనలు, పాత్రలు పునరుద్ధరించబడే నాటకాలను Restoration Drama అని పిలుస్తారు. తెలుగు సాహిత్యంలో ప్రహసనం పరిమిత సంఖ్యతో ఉంది, ఈ ప్రక్రియను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రహసనం తక్కువ పరిమాణంలో ఉండి కూడా హాస్య, వ్యంగ్యం మరియు సామాజిక విమర్శలకు గొప్ప వేదికనివ్వగలదు. అందుకే తెలుగు ప్రహసన సాహిత్యంలో మళ్లీ పునఃప్రారంభం కావాలనే కోరుకుందాం. ఈ ప్రక్రియకు పరిశోధనలు, సమీక్షలు, కూడా మంచి పునర్నిఖండన అవసరం, తద్వారా ప్రహసనం తాత్పర్యాన్ని హాస్యంతో , సమాజ విమర్శతో సమన్వయంతో మరింత బలోపేతం చేయవచ్చు. ఇది తెలుగు నాటక కళా రంగంలో ఒక పునర్నిర్మాణ దిశగా దారి తీస్తుంది.తెలుగు సాహిత్యలో ప్రహసనం రంగం మరింత అభివృద్ధి చెందాలి, కావలసిన ప్రోత్సాహం పొందాలి అని కోరుకుంటూ...



డా. ఐ. చిదానందం
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

# మూడుతరాల ఉద్యమానికి వంతెన ప్రొ.జయశంకర్

**(ఆగస్టు 24న ప్రొ.జయశంకర్ 14వ స్మారకోపన్యాసం)**




స్వీయ అస్తిత్వం కోసం, ప్రజాస్వామ్య పరివర్తన కోసం కన్నీళ్ళు, రక్తం కలగలిసిన అసంఖ్యాక బలిదానాలను చేసింది తెలంగాణ. ఈ క్రమంలోనే తన స్వీయ జీవితాన్ని మండించి,మూడుతరాల ఉద్యమానికి వంతెనగా మారి తెలంగాణ లక్ష్యాన్ని తీరం చేర్చిన వైతాళికుడు ఆచార్య జయశంకర్ సార్. స్వరాష్ట్రంలో ఉపాధి అవకాశాలు,సామజిక న్యాయం, ప్రజాస్వామిక స్వేచ్ఛ సాధించుకుంటారని, తెలంగాణ చారిత్రక స్ఫూర్తి పునాదిగా అధికారాన్ని ప్రజలు నియంత్రిస్తారని భావించిండు.విద్యావంతులు మౌనంగా ఉంటే భవిష్యత్తు సమాజాన్ని కాపాడలేమని, గతంలో చేసిన త్యాగాలకు విలువ ఉండదని, ఉద్యమ విలువలకు సమాజంలో నీడ ఉండదని,తెలంగాణ ఏర్పాటు అనంతరం కూడా అంతర్గత దోపిడీ విధానాలు కొనసాగుతాయని, వాటిమీద నిరంతరం పోరాటం చేయగలిగే చైతన్యవంతమైన పౌర సమాజం తెలంగాణలో ఎల్లకాలం ఉంటుందని విశ్వసించారు.ఈ దోపిడీ విధానాలను ఎదుర్కొనేందుకు మరింత పదునైన పోరాటాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిండు.ఆ క్రమంలోనే 2004లో ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం వారి అధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వయం పాలన పేరు మీద గత పాలకులు చేసిన మోసాలను,ఉద్యమ పీఠికను విధ్వంసం చేసి ఉద్యమ ఫలితాన్ని తమ వారి కోసం వినియోగించుకున్న తీరును విప్పిచెప్పింది.ఉద్యమ సంస్థలను, ఉద్యమకారులను సంఘటితం చేసి ఆ నియంతను తొలగించడంలో టి.వి.వి వేశేష కృషి చేసింది. కొత్తగా ఏర్పడ్డ ఈ ప్రభుత్వం నుంచి కూడా ఉద్యమ ఆకాంక్షలని సాధించుకోవడానికి సైతం జయశంకర్ సార్ ప్రభోదించిన ఉద్యమ స్ఫూర్తే ఏకైక మార్గం అని విద్యావంతుల వేదిక విశ్వసిస్తుంది.మరోవైపు బహుళత్వ భారతదేశాన్ని అసహన సమాజంగా మార్చివేయడం కోసం తరాలుగా పోగు చేసుకున్న మహత్తర భారతీయ భావనను కేంద్ర పాలకులు చిదిమి వేస్తున్నారు. ఈ దేశ నేల, నీరు, అడవులు, కార్మిక మానవ శక్తులను తన స్వదేశీ, విదేశీ కార్పోరేట్ మిత్రులకు అప్పనంగా కట్టబెడుతూనే ఇక్కడి ప్రజల ధార్మిక జీవితాన్ని కూడ తన ఆధీనంలోకి తీసుకుంటున్నారు.ఈ పరిస్థితులలో తమ హావభావాల చాటున కప్పివేయబడిన కుయుక్తులను బయటపెట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తులను, పౌరసమాజాన్ని రక్తపు మడుగులలోకి, భయ సంస్కృతిలోకి, మౌన లొంగుబాటులోకి పంపుతున్నారు. సమాజాన్ని చీకట్లు కమ్మేస్తున్నప్పుడు, ఆధిపత్య శక్తులు పంజావిసురుతున్న విధ్వంసక పాలనా విధానాలను ప్రతిఘటించకపోతే ఈ దేశాన్ని, ఉదాత్త విలువల రాజ్యాంగాన్ని, ఉద్యమ ఆకాంక్షలను రక్షించుకోలేము.అంతేగాక సమాజ పరివర్తన పాదాలు వెనక్కి విరిచి వేయబడతాయి. అందుకే ఈ పాలనా విధానాలను ఎదురిద్దాం.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంఘటితంగాను, సమన్వయంతోనూ,సమాంతరంగాను పనిచేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన తోవలో పనిచేసే వారిని కలుపుకోవడానికైనా లేదా వారితో కలిసి నడవటానికైనా చారిత్రక ప్రాధాన్యత, వర్తమాన పోరాటగరిమ కలిగిన సంస్థగా తెలంగాణ విద్యావంతుల వేదిక చిత్త శుద్ధితో కృషి చేస్తుంది.

ఈ ప్రయత్నంలో భాగంగానే జయశంకర్ సార్ అమరులైన నాటి నుండి దేశంలోను,రాష్ట్రంలోను ప్రముఖ మేధావులను ఆహ్వానించి ప్రతి ఏట జయశంకర్ స్మారకోపన్యాసాన్ని నిర్వహిస్తూ వస్తుంది.ఈసారి కూడ జయశంకర్ సార్ 14వ స్మారకోపన్యాసాన్ని ఆగస్టు 24, 2025న ఈ.సి ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్నది. ఈ సదస్సు కు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సామాజిక న్యాయ రంగాలలో ఉన్నత స్థాయి అనుభవాలు కలిగిన నల్సార్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కృష్ణదేవరావుతోపాటు, జాతీయస్థాయిలో అనేక సంచలన అంశాలను వెలుగులోకి తీసుకొస్తున్న సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది అంజలి భరద్వాజులు ప్రసంగిస్తారు. అంజలి భరద్వాజ్ గారు ప్రఖ్యాత సామాజిక కార్యకర్త. పాలనా వ్యవస్థలో పారదర్శకత,జవాబుదారితనం, కొరకు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారుసమాచార హక్కు సాధన తో పాటు అమలు కోసం పోరాడుతూనే ఎలక్టోరల్ బాండ్స్ మొదలుకొని ప్రస్తుతం బీహార్ లో కొనసాగుతున్న ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)వరకు రాజీ లేని పోరాటం కొనసాగిస్తున్నారు. ప్రొఫెసర్ కృష్ణదేవరావు గారు తెలంగాణ నుంచి అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ దాకా ప్రాతినిధ్యం వహించడమే కాక అంతర్జాతీయ స్థాయిలో అనేక ఫెలోషిప్లు పొంది ఢిల్లీ ఒరిస్సా నల్సార్ యూనివర్సిటీలకు గతంలో ఉపకులపతిగా పనిచేసి ప్రస్తుతం హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీకి ఉప కులపతిగా కొనసాగుతున్నారు.

అంబటి నాగయ్య
తెలంగాణ విద్యావంతుల వేదిక
రాష్ట్ర అధ్యక్షులు, సెల్: 9966989579

# గోబెల్స్ కే దగ్గులు నేర్పుతున్నారు!




ఎవరీ గోబెల్స్?అబద్ధాలకు గురువు ఆయన. కుక్కను నక్క అని, నక్కను కుక్క అని ఎలాంటి వారినైనా తాను అబద్ధాలు చెబు తూ వాటిని నిజాలు అని ఒప్పించగల నేర్పరి ఆయన.అంటే ఆయన తిమ్మి బమ్మిగా, బమ్మిని తిమ్మిగా ఒప్పించగల అత్యంత ప్రతిభావంతుడు, సమర్థుడు. ఎలాంటి అబద్దాన్ని అయినా నిజం అని ఒప్పించి, నమ్మించ గల నేర్పు, ప్రతిభ ఆయన గారికే సొంతం. ఒక్క మాటలో చెప్పాలంటే అప్పట్లో ఆయన అబద్దానికే పర్యాయపదంగా ఉండేవారు.జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ ఉండేవాడు కదా. ఆయన క్యాబినెట్ లో ఈయన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా పని చేశారు. అలా ఈయన గారు మొత్తం ప్రపంచానికీ సుపరిచితుడు. అలాంటి గోబెల్స్ కే అబద్ధాలు చెప్పి అవి నిజాలు అని ఆయనే నమ్మించగల నేర్పరులు, నిష్ణాతులు ఇప్పుడు మన దేశంలో ఎంతో మంది తయారయ్యారు. వీళ్లు పూర్తిగా నిజమే అని జనం నమ్మి వేయగల ఒక పెద్ద అబద్ధం ఇప్పుడు దేశంలో విస్తృత ప్రచారంలోకి వచ్చింది. ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్%రి% పేరిట బిహార్ లో 65 లక్షల ఓట్లు తొలగించడం, గత పార్లమెంటు ఎన్నికల్లో జరిగిన అనేక అక్రమాల్లో కొన్నిటిని రాహుల్ గాంధీ బయట పెట్టడంతో వాటిని కప్పిపుచ్చు కోవడానికి సోనియా ఓటు చోరీ అనే ఒక అబద్ధాన్ని సృష్టించింది జాతీయ అధికార పార్టీ అబద్ధాల ఫ్యాక్టరీ. గోబెల్స్ ఉపోద్ఘాతం అంతా ఆ అబద్ధం గురించి చెప్పడానికే.సోనియా గాంధీ ఎప్పుడో ఓటు చోరీ చేశారనేది ప్రచారంలోకి వచ్చిన ఆ అబద్ధం. దాని కోసం ఒక తప్పుడు పత్రాన్ని సృష్టించా రు. చూసిన వారికి అది నిజమేనేమో అని అనిపిస్తుంది. ప్రచారంలోకి వచ్చిన ఆ విషయం ఇలా ఉంది.. 1983 లో భారత పౌరసత్వం పొందిన సోనియా 1980 లోనే ఢిల్లీ నగరంలో ఓటు హక్కు పొందారు. పౌరసత్వం లేకుండా ఓటు హక్కు పొందడం ఓటు చోరీ చేయడం అవుతుందననేది వారి వాదన. నిజమే పౌరసత్వం లేకుండా ఓటు పొందడం నేరమే అవుతుంది. అలా సోనియా గాంధీ 40 యేళ్లక్రితమే ఓటు చోరీకి పాల్పడ్డారని సోషల్ మీడియాలో ఇప్పుడు ప్రచారంలో పెట్టిన ఒక కథ. దీని కోసం ఢిల్లీ ఓటరు జాబితాలో సోనియా కుటుంబ సభ్యులతో కూడిన ఒక ఫోటోను ప్రచారంలో పెట్టారు. అయితే.. ఆ అబద్ధ సృష్టిలో ఒక పొరపాటు చేసింది సదరు అబద్ధాల ఫ్యాక్టరీ. 1980 నాటి ఆ ఓటరు జాబితాపై ఎన్సిటిడి %ళ%నేషనల్ క్యాపిటల్ టెరిటరి ఆఫ్ ఢిల్లీ%రి% అని రాసి ఉంది. కానీ ఢిల్లీ నగరం అప్పుడు ఎన్సిటిడి కాదు. ఢిల్లీ అప్పుడు యూటీడీ యూనియన్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ%రి%గా మాత్రమే ఉన్నది. ఢిల్లీ ఎన్సిటిడి గా మారిపోయింది 1992లో ఇలా ఒక అబద్ధాన్ని నిజం అని చెప్పడానికి చేసిన ప్రయత్నంలో ఈ పొరపాటు చేసింది ఆ ఫ్యాక్టరీ. సామాన్య జనానికి ఈ సంగతి తెలియదు అర్థం కాదు అనే అతి విశ్వాసంతో ఈ పొరపాటు చేసి ఉండవచ్చు. భారత సమాజంలో ఇలాంటి లక్షలాది అబద్ధాలు ఇప్పుడు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. మెజారి టీ జనం వాటిని అమాయకంగా విశ్వసిస్తు న్నారు. భారత సమాజంలోని ఒక పెద్ద వర్గం ఇలాంటి అబద్ధాలను విశ్వసిస్తూ ఒక మాయలో మునిగి పోయింది. ఇలాం టి కట్టుకథల అబద్ధాలతోనే నాడు గోబెల్స్ జర్మన్ సమాజాన్ని మాయ చేశాడు. ఇది హిట్లర్ ఎజెండా. ఈ కట్టుకథల ప్రచారా లతో జర్మన్ సమాజంలో హిట్లర్ అత్యంత శక్తివంతమైన నాయకుడు మారిపో యాడు. అలా రెండవ ప్రపంచ యుద్దానికి జర్మనీ సమాజాన్ని సమాజాన్ని నమ్మించి, ఒప్పించి హిట్లర్ కు ఎంతో సాయం చేశాడు గోబెల్స్. అలాంటి స్థితిలోనే రెండో ప్రపంచ యుద్ధం జరగడం, కోట్లాది మంది అన్యాయపు, అకాల, అర్థాంతర మరణాలకు దారి తీసింది. గ్యాస్ చాంబర్ లలో యూదులను నిర్బంధించి జాతి హననానికి పాల్పడడం చరిత్రలో ఒక మాయని మచ్చ.హిట్లర్ దొరవారి ఈ అభిజాత్యపు మూర? ఎజెండా అమలులో ఈ సమాచార మంత్రి గారే ఇలాంటి ప్రచారం చేసి ప్రధాన భూమికను పోషించారు. ఇప్పుడు సరిగ్గా అలాంటి పాత్రను ఇక్కడ, ఈ దేశంలో మాలవీయ అనే అభినవ గోబెల్స్ పోషిస్తున్నారు. సరిగ్గా నాడు జర్మనీలో ఉన్న దుస్థితే ఇప్పుడు ఈ సమాజంలో ఏర్పడింది. అప్పుడు అక్కడ గోబెల్స్ పోషించిన పాత్రనే ఇప్పుడు ఇక్కడ మాలవీయ గారి సారథ్యంలో ఒక పెద్ద వ్యవస్థ పోషిస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక సాంకేతిక హంగులు ఈ వ్యవస్థ వద్ద ఉన్నాయి. ఈ వ్యవస్థ సృష్టించిన ఒక అబద్ధం క్షణాల వ్యవధిలోనే కొన్ని లక్షల మందికి చేరుతుంది.వారి నుంచి పాలక పార్టీ భృత్యు మూక చేతుల్లోకి వెళ్లిపోతుంది. అలా ఆ మూక తనకు అందిన ఆ ఆడియో, వీడియో, టెక్స్ట్ మార్ఫ్ సమాచారాన్ని సామాన్య జనంలోకి వెళ్లి పోతుంది. అలా వెళ్లిన ఈ సమాచారం సామాన్యుల్లో అమా య కంగా విశ్వసించే వారి సంఖ్యనే అత్యధికంగా ఉంటున్నది. విశ్వాసం కల్పించడం వల్ల వాటిని విశ్వసిస్తారు సామాన్యులు. అంటే సదరు అబద్ధా లను ఎంత పకడ్బందీగా సృష్టిస్తారో అర్థం చేసుకోవాలి.అందుకే వీళ్లు గోబెల్స్ కే తాత లాంటి వారు, ఆ తాతకే దగ్గులు నేర్పుతారు అని చెప్పేది. అలా ఈ వ్యవస్థ సర్కారును నిత్యం కంటికి రెప్పలా వజ్ర కవచంగా పని చేస్తూ కాపాడుతున్నది. పన్నెండేళ్లుగా దాని దుష్ఫలితాలు, దుష్పరిణా మాలను భారత సమాజం అనివార్యంగా అనుభవించవలసి వస్తున్నది.





- గంటె గోవర్ధన్,
ప్రత్యేక ప్రతినిధి, విశ్వంభర దినపత్రిక
ఫోన్ : 9347056621

# క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నా..
# జీవితంలో నాకు దక్కిన గౌరవమిదే..!



భారత మహిళా క్రికెటర్ గౌహెర్ సల్తానా వీడ్కోలు పలికింది. చురుకైన ఫీల్డర్‌గా పేరొందిన ఆమె అంతర్జాతీయ క్రికెట్లోని అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలిగింది. గురువారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన రిటైర్మెంట్ వార్తను వెల్లడించిందీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. చివరిసారిగా 2014 ఏప్రిల్‌లో టీమిండియా జెర్సీ వేసుకున్న సుల్తానా ఆ తర్వాత డబ్ల్యూపీఎల్‌తో వెలుగులోకి వచ్చింది. రెండు సీజన్లలో యూపీ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించిందీ స్పిన్ ఆల్‌రౌండర్. 'వరల్డ్ కప్స్, విదేశీ పర్యటనల్లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించడం జీవితంలో నాకు దక్కిన గొప్ప గౌరవం. దేశానికి ఆడడం ద్వారా నా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరిగాయి. నేను తీసిన ప్రతి వికెట్, మైదానంలో చేసిన ప్రతి డైవ్, మ్యాచ్ సమయంలో సహచరులతో గుంపుగా నిల్చోవడం వంటవి నేను క్రికెటర్‌గా రాటుదేలడంలో ఉపయోగపడ్డాయి' అని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. 2014లో జట్టులో చోటు కోల్పోయిన సుల్తానా మహిళల ప్రీమియర్ లీగ్‌లో మళ్లీ స్టేడియంలో అడుగుపెట్టింది. రెండో సీజన్‌లో విఫలమైన తను.. మూడో ఎడిషన్లో ఫర్వాలేదనిపించింది. 2008లో అరంగేట్రం చేసిన సుల్తానా 57 వన్డేలు, 37 టీ20లు ఆడింది. వన్డేల్లో 19.39 సగటుతో 66 వికెట్లు పడగొట్టింది.

# వరుసగా మూడోసారి..
# బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా అజయ్ సింగ్




భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా అజయ్ సింగ్‌వరుసగా మూడోసారి ఎన్నికయ్యాడు. ఏకపక్షంగా సాగిన పోటీలో ఆయన ప్రత్యర్థి జస్లాల్ పర్ధాన్‌పై 26 ఓట్ల తేడాతో గెలుపొందాడు. రాష్ట్ర స్థాయి సంఘాల మద్దతుతోనే తాను హ్యాట్రిక్ విక్టరీ కొట్టానని. భారత బాక్సింగ్‌కు తన మరో దఫా సేవల్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని అజయ్ అన్నాడు. రాష్ట్రాలకు చెందిన 34 సంఘాలు 66 ఓట్లతో ఈ ఎన్నికలో పాల్గొన్నాయి. తనకు మూడోసారి అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు అందరికీ అజయ్ సింగ్ కృతజ్ఞతలు తెలిపాడు. 'ఈ విజయం నాపై మీకున్న నమ్మకానికి ప్రతీక. ఇది విజయం మాత్రమే కాదు ఇన్నేళ్లుగా భారత బాక్సింగ్ పురోగతి మా బృందం అలుపెరగకుండా చేస్తున్న కృషికి దక్కిన గౌరవం. ఈ సందర్భంగా బీఎఫ్ఐ మధ్యంతర కమిటీ, అబ్జర్వర్ ఫయరుజ్ ముహమ్మద్ ప్రత్యేక ధన్యవాదాలు.నాతో పాటు బీఎఫ్ఐ సభ్యులుగా ఎంపికైన మిత్రులందరికీ శుభాకాంక్షలు. త్వరలోనే వరల్డ్ ఛాంపియన్‌షిప్, వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలు ఉన్నాయి. ప్రస్తుతం మా దృష్టంతా మన బాక్సర్లు గొప్పగా రాణించి.. దేశానికి పతకాలు తీసుకువచ్చేలా చేయడం మీదనే ఉంది' అని అజయ్ సింగ్ వెల్లడించాడు. సెక్రటరీ జనరల్ పదవి కోసం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ కుమార్ ఎంపికయ్యాడు. సమీప ప్రత్యర్థి దిగ్విజయ సింగ్‌పై 6 ఓట్ల తేడాతో విజయం సాధించారు. కోశాధికారి పోస్టును పాన్ బక్సరన్ దక్కించుకున్నాడు.

# మిస్టరీ స్పిన్నర్ మళ్లీ దూరం..
# కుర్రాళ్లనే నమ్ముకున్న శ్రీలంక






శ్రీలంక మిస్టరీ స్పిన్నర్ వనిందు హసరంగ మళ్లీ జట్టుకు దూరమమ్యాడు. జూలైలో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సమయంలో తొడకండరాల గాయంతో బాధపడిన అతడు ఇంకా కోలుకుంటున్నాడు. దాంతో, జింబాబ్వే పర్యటన (%గుఅఎఝఎషవ ంశీబతీ%)కు లంక స్పిన్ అస్త్రంగా దునిత్ వెల్లలాగే, జెఫ్రీ వాండర్సే ఎంపికయ్యారు. వైట్ బాల్ సిరీస్ కోసం గురువారం చరిత అసలంక సారథిగా 16మంది బృందాన్ని ప్రకటించారు సెలెక్టర్లు. బంగ్లాదేశ్ పర్యటనలో మెరిసిన అవిష్క ఫెర్నాండో, ఇషాన్ మలింగకు మాత్రం చోటు దక్కలేదు. వన్డేల్లో ఇరగదీస్తున్న లంక పేస్ త్రయం ఈసారి జింబాబ్వే బ్యాటర్ల భరతం పట్టేందుకు సిద్ధమవుతోంది. దుష్మంత చమీర, దిల్షాన్ మధుషనక, అసితా ఫెర్నాండ్‌లకు.. స్పిన్ దళంలోని థీక్షణ, వెల్లలాగే, వాండర్సే తోడయ్యారంటే ఆతిథ్య జట్టుకు కష్టకాలమే. ఆగస్టు చివరి వారంలో మొదలయ్యే పర్యటనలో లంక రెండు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. అయితే.. పొట్టి ఫార్మాట్ స్క్వాడ్‌ను ఇంకా వెల్లడించలేదు. హరారేలో ఆగస్టు 29న తొలి వన్డే, ఆగస్టు 31న రెండో వన్డేలోజింబాబ్వేతో లంక తలపడనుంది.

శ్రీలంక స్క్వాడ్ : చరిత అసలంక(కెప్టెన్), పథుమ్ నిశాంక, నిశాన్ మధుష్క, కుశాల్ మెండిస్, సధీర సమరవిక్రమ, నువనిందు ఫెర్నాండో, కమిందు మెండిస్, జనిత్ లియనగే, పవన్ రత్ననాయకే, దునిత్ వెల్లలాగే, మిలాన్ రత్ననాయకే, మహీశ్ థీక్షణ, జెఫ్రీ వాండర్సే, అసితా ఫెర్నాండో, దుష్మంత్ చమీర, దిల్షాన్ మధుషనక.


# టెస్టులకు దూరమై రెండేళ్లు..
# 'రంజీ'కి రెడీ అవుతున్న నయావాల్..!




టెస్టులకు దూరమైన భారత క్రికెటర్ ఛతేశ్వర్ పుజారామళ్లీ మైదానంలోకి వస్తున్నాడు. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ లు వీడ్కోలు పలికిన తర్వాత జాతీయ జట్టులో చోటు ఆశించి భంగపడిన 'నయావాల్' రంజీ ట్రోఫీ దృష్టి సారించాడు. ఇంగ్లండ్ పర్యటన సమయంలో విశ్లేషకుడిగా మెప్పించిన పుజారా మళ్లీ తన బ్యాట్ పవర్ చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. త్వరలో మొదలయ్యే రంజీ సీజన్ 2025-26లో అతడు సౌరాష్ట్ర తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ విషయంపై గురువారం స్పందించిన సౌరాష్ట్ర క్రికెట్ సంఘం తమకు పుజారా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని తెలిపింది. 'పుజారా దిగ్గజ ఆటగాడు. రంజీల్లో అతడికి గొప్ప రికార్డు ఉంది. అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అతడి అనుభవం మా జట్టుకు ఎంతగానో ఉపయోగపడనుంది' అని ఎస్‌సీఏ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించాడు. దేశవాళీలో రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్‌లతో చెలరేగిన పుజారా 2023లో టెస్టు జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత రంజీల్లో శతకాలతో మెరిసి.. పునరాగమనం కోసం ఎదురుచూసినా సెలెక్టర్లు మాత్రం అతడిపై కరుణ చూపలేదు.ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్, కోహ్లీ రిటైర్ అవడంతో తనకు ఛాన్స్ వస్తుందని పుజారా ఊహించాడు. కానీ, హెడ్‌కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మాత్రం కుర్రాళ్లకే పట్టం కట్టారు. మూడో స్థానంలో సాయి సుదర్శన్‌ను ఆడించి నయా వాల్ ఆశలపై నీళు చల్లారు. క్రికెట్ ఆడాలని ఉన్నంత కాలం జాతీయ జట్టుకు అయినా.. దేశవాళీ జట్టుకు అయినా ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమేనని ప్రకటించిన పుజారా వచ్చే రంజీ ట్రోఫీలో రఫ్ఫాడించనున్నాడు. నిరుడు ఏడు మ్యాచుల్లో 40 సగటుతో 402 రన్స్ కొట్టాడు.

అయితే.. ఫిబ్రవరిలో రంజీ సీజన్ ముగిశాక అతడు నెట్స్‌లో ప్రాక్టీస్ చేయలేదు. కౌంటీల్లో ఆడే అవకాశం వచ్చినా.. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో కామెంటేటర్‌గా వ్యవహరించి ఫ్యాన్స్‌ను అలరించాడీ వెటరన్. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా పేరొందిన పుజారా సుదీర్ఘ ఫార్మాట్‌లో 103 మ్యాచులు ఆడి 7,195 పరుగులు సాధించాడు.

# తీపి రుగ్మతను.. తిప్పి కొడదాం





డయాబెటిస్.. దాదాపు ప్రతి ఇంట్లో వినిపించే జీవనశైలి ప్రధానమైన జబ్బు. ఇది ఒక్కసారి వస్తే జీవితాంతం వదలదు. బతికినంత కాలం మందులు వాడాల్సిందే. అయితే, ఇది నిన్నటి మాట. వచ్చిన రోగాన్ని తిరిగి వెనక్కి పంపించవచ్చునేది నేటి భరోసా! అవును ఇది అక్షరాల నిజమే. డయాబెటిస్‌ను నియంత్రించడవే కాకుండా వ్యాధిని వెనక్కి తిప్పి కొట్టవచ్చంటున్నారు వైద్యరంగ నిపుణులు. దీనికి కొన్ని నియమ నిబంధనలు, వయసు పరిమితి, వ్యాధి వచ్చిన కాలపరిమితి లాంటివి కీలకం అని చెబుతున్నారు. ఒక్కసారి షుగర్ వ్యాధి వచ్చిన తర్వాత రివర్సల్ డయాబెటిస్ ఎలా సాధ్యం, అందుకు పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

డయాబెటిస్ అంటే రక్తంలో చక్కెర (బ్లడ్ గ్లూకోజ్) స్థాయిలు పెరగడం. 80వ దశకానికి ముందు డయాబెటిస్ అనే సమస్య ఒకటి ఉందనే విషయం చాలామందికి తెలియదు. కాలక్రమేణా ఈ సమస్య 60 ఏండ్లు పైబడిన వారికి, బాగా డబ్బున్నవాళ్లలో మాత్రమే ఎక్కువగా కనిపించేది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల ఉద్యోగాలు తదితర కారణాలతో ప్రస్తుతం ఈ వ్యాధి వయసు, ఆర్థిక స్థాయి, లింగ భేదంతో సంబంధం లేకుండా అందరిలోనూ వస్తున్నది. పిల్లల్లో జువైనల్ డయాబెటిస్‌గా లేదా టైప్-1 డయాబెటిస్‌గాను, పెద్దల్లో ఎక్కువ శాతం టైప్-2 డయాబెటిస్ రూపంలో దాడి చేస్తుంది. శాస్త్రీయంగా చూస్తే డయాబెటిస్ రావడానికి ప్రధాన కారణం క్లోమగ్రంథిలోని బీటా కణాలు అవసరమైనంత మోతాదులో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేక పోవడం. లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవడం. వ్యాధి నిరోధక వ్యవస్థకు సంబంధించిన కారణం వల్ల చిన్నారుల్లో కూడా ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. బీటా కణాలు పనిచేయకపోవడం పిల్లల్లో అసలు ఇన్సులిన్ తయారు కాదు. అందు వల్ల వీళ్లకు తప్పనిసరిగా ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం అవుతాయి.

పెద్దవారిలో సర్వసాధారణంగా కనిపించేది రెండో రకం డయాబెటిస్. 90 శాతం మంది మధుమేహులు టైప్-2 ఉన్నవారే. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల దీన్ని నియంత్రించవచ్చు. స్థూలకాయం ఉన్న కొందరు మహిళల్లో గర్భిణిగా ఉన్నప్పుడు కనిపించేది జెస్టేషనల్ డయాబెటిస్. ఇది తాత్కాలికమే అయినప్పటికీ దీర్ఘకాలంలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువ.

ఎలా వెనక్కి పంపవచ్చు?: టైప్-2 డయాబెటిస్ ఉన్న రోగుల్లో మాత్రమే రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది. అంటే వ్యాధిని వెనక్కి పంపవచ్చు. టైప్-1 వారిలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడదు.

ఎప్పుడు సాధ్యం?: షుగర్ వ్యాధి వచ్చిన రెండు సంవత్సరాల్లోపు, లేదా ప్రీ డయాబెటిస్ దశలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యమవుతుంది. అంటే వచ్చిన రోగాన్ని వెనక్కి పంపవచ్చు. ఈ రివర్సల్ డయాబెటిస్ అనేది గతంలో కూడా ఉన్నది. కాకపోతే అప్పుడు అందుబాటులో ఉన్న మందులతో అది పెద్దగా సాధ్యపడలేదు. ప్రాచుర్యంలోకి కూడా రాలేదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ రివర్సల్ డయాబెటిస్‌పై దృష్టి పెట్టారు. వైద్యరంగంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ప్రస్తుతం ఊబకాయం కోసం కొత్త కొత్త మందులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి సాయంతో రివర్సల్ డయాబెటిస్ మంచి ఫలితాలు ఇస్తున్నది. జీవనశైలిలో మార్పులతోపాటు కొన్ని రకాల మందులతో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది.

సాధారణ చక్కెర స్థాయిలు: పరగడుపున (అల్పహారానికి ముందు) ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయిలు 100 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉండాలి. భోజనం చేసిన రెండు గంటల్లోపు పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ స్థాయిలు 140ఎంజీ/డీఎల్‌గా ఉండాలి.

చికిత్సా పద్ధతి: షుగర్ వ్యాధి వచ్చి, మందులు వాడుతున్న వారికి లేదా ప్రీ-డయాబెటిస్ రోగులకు రివర్సల్ డయాబెటిస్ చికిత్స అందించవచ్చు. అయితే ఇది అందరికీ సాధ్యపడదు. వ్యాధి వచ్చిన రెండేండ్ల లోపు వారిలో మాత్రమే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఇక చికిత్స విధానంలోకి వెళ్తే షుగర్ వ్యాధిగ్రస్తులు డయాబెటిస్ మందులు వాడుతూనే వైద్యుల సూచన మేరకు ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు కూడా చేసుకోవాలి. అంతేకాకుండా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దీనివల్ల నెమ్మదిగా షుగర్ అదుపులోకి వస్తుంది. మొదటి నెలలోనే ఫలితాలు కనిపించడం మొదలవుతుంది. వీరికి మొదటి మూడు నెలల వరకు ప్రతినెలా షుగర్ పరీక్షలు చేస్తూ పర్యవేక్షించాలి. ఆ తర్వాత ప్రతి 3 నెలలకు ఒకసారి షుగర్ టెస్టు చేయాల్సి ఉంటుంది. అయితే వ్యాధి నియంత్రణలోకి వచ్చిన తర్వాత క్రమంగా మందుల మోతాదును తగ్గిస్తూ పోతారు. ఫాస్టింగ్ (పరగడుపున) బ్లడ్ గ్లూకోజ్ స్థాయిలు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ (తిన్న రెండు గంటల తర్వాత) బ్లడ్ గ్లూకోజ్ స్థాయిలు 140ఎంజీ/డీఎల్, హెచ్‌బీఏ-1సి శాతం 5.7కంటే తక్కువగా వచ్చిన తర్వాత డయాబెటిస్ మందులను పూర్తిగా నిలిపివేస్తారు.

మూడు నెలల తర్వాత..: డయాబెటిస్ మందులు మానేసిన 3 నెలల తర్వాత కూడా ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయిలు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ 140ఎంజీ/డీఎల్‌గాను, హెచ్‌బీఏ 1సి 5.7 శాతం కంటే తక్కువగా ఉంటే అప్పుడు రోగిని రివర్సల్ డయాబెటిస్ కింద పరిగణిస్తారు. అంటే షుగర్ వ్యాధి తగ్గినట్టుగా భావించవచ్చు. ప్రస్తుతం 10 మంది డయాబెటిస్ రోగులకు రివర్సల్ చికిత్స అందిస్తే అందులో ఆరుగురిలో వ్యాధి నియంత్రణలోకి రాగా ఇద్దరిలో రివర్సల్ డయాబెటిస్ ఫలితాలు వస్తున్నాయి. డైట్, బరువు, ఆహారపు అలవాట్లు మార్చుకుని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే రివర్సల్ డయాబెటిస్ సాధ్యమే! అంటే తాత్కాలికంగా షుగర్ తగ్గవచ్చు. ఈ సమయంలో షుగర్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. అయితే, మందులు వాడాల్సిన అవసరం లేదు. పాంక్రియా (క్లోమగ్రంథి) సామర్థ్యం అధికంగా ఉండటం వల్ల షుగర్ స్థాయిలు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రీ-రివర్స్ డయాబెటిస్: ఒక్కసారి వచ్చి, తగ్గిపోయిన తర్వాత మళ్లీ వచ్చే డయాబెటిస్‌ను రీ-రివర్స్ డయాబెటిస్ అంటారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు సరిగ్గా పాటించకపోతే అప్పుడు మళ్లీ డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే రివర్సల్ డయాబెటిస్ ఫలించిన కొందరు రోగుల్లో ఆరు నెలలకే మళ్లీ రీ-రివర్స్ డయాబెటిస్ రావచ్చు. ఆరోగ్య నియమాలు తు.చ. తప్పకుండా పాటించే వారిలో కొన్ని సంవత్సరాల వరకు కూడా మళ్లీ డయాబెటిస్ రాకపోవచ్చు.

పాటించాల్సిన ఆహార నియమాలు: బాగా మరపట్టిన బియ్యంతో చేసిన అన్నం తినకూడదు. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ వంటి తెల్లటి పిండి పదార్థాలతో తయారుచేసిన వంటకాలకు దూరంగా ఉండాలి.

ఆలు, బీట్‌రూట్, క్యారెట్లు కూడా తీసుకోకూడదు. బేకరీ పదార్థాలను అసలే తినకూడదు. కాఫీ, టీలో చక్కెరను పూర్తిగా తగ్గించాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కుటుంబ నేపథ్యం ఉన్నవారు..

కుటుంబ నేపథ్యంలో డయాబెటిస్ బాధితులు ఉన్నవారు పై నియమాలు కచ్చితంగా పాటించాలి. ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు లేదా వారంలో 150 నిమిషాలు వాకింగ్ లేదా రన్నింగ్ వంటివి చేయాలి. తల్లిదండ్రులకు షుగర్ ఉంటే వారి పిల్లలు తమ బరువును అదుపులో ఉంచుకోవాలి. ముఖ్యంగా డైట్‌ను కంట్రోల్ చేస్తే షుగర్ వ్యాధి రాకుండా నివారించుకోవచ్చు.



# రాగి పాత్రల్లో నీళ్లు
# తాగితే ఎంతో ఆరోగ్యం

రాగి పాత్ర... అంటే ఏంటి అని అడిగే వాళ్ళు కూడా ఉంటారు ఈ రోజుల్లో. ఎందుకంటే... ఇపుడంతా ప్లాస్టిక్, గాజు గ్లాసులే ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. వీలైతే పేపర్ గ్లాసులు కూడా వాడేస్తున్నారు. కానీ, రాగి పాత్రలో మంచినీళ్ళు తాగితే ఎంత మంచిదో తెలుసా? ఇది బ్యాక్టీరియాను అరికడుతుందని పరిశోధనలో తేలింది. రాబ్ రీడ్ అనే మైక్రో బయాలజిస్ట్ ప్లాస్టిక్, మట్టి, రాగి పాత్రలలో విరోచనాకారి అయిన బాక్టీరియాతో కూడిన నీటిని వాటిలో ఉంచి, 48 గంటల తరువాత ఆ నీటిపై పరిశీలన చేశాడు. రాగి పాత్రలో ఉంచిన నీళ్ళలో బాక్టీరియా శాతం తగ్గింది. అదే ప్లాస్టిక్, మట్టి పాత్రలో ఉన్న బాక్టీరియా శాతం రెండింతలు అయ్యింది.

రాగి పాత్ర వల్ల ఉపయోగాలు:జీర్ణ వ్యవస్థకు మంచిది: రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అసిడిటీ, గ్యాస్, అజీర్ణం వంటివి తగ్గడమే కాకుండా, కడుపుకి హాయి కలిగించి, ప్రాణాంతకరమైన బాక్టీరియాను కూడా నిర్మూలిస్తుంది. కిడ్నీ, లివర్ చురుకుగా పనిచేయడంలో తోడ్పడుతుంది.

బరువు తగ్గిస్తుంది: మనం అధిక బరువు తగ్గడానికి రకరకాల పండ్లు, కూరగాయలు వంటివి తింటూ ఉంటాం. కాని వాటివల్ల వచ్చే ప్రయోజనాల కన్నా, వాటికి ఖర్చుపెట్టిన డబ్బు వ్యర్థం అయిందన్న దిగులే ఎక్కువ. రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అది జీర్ణ వ్యవస్థను సరైన మార్గంలో నడిచేలా చేసి, కొవ్వు మరియు ఇతర చెడు బాక్టీరియాను శరీరం నుండి తీసేస్తుంది.

గాయాలను త్వరగా నయం చేస్తుంది: రాగిలో ఉండే యాంటీ-బాక్టీరియాతత్వం శరీరంలోని అనేక గాయాలను వేగంగా నయం చేయడంతోపాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరిచి, శరీరంపై ఉన్న గాయాలనే కాకుండా లోపల ఉన్న గాయాలను, ముఖ్యంగా కడుపులో ఉన్నగాయాలను కూడా తగ్గించడంలో సహాయం చేస్తుంది.

క్యాన్సర్ వ్యాధి నుండి పోరాడుతుంది: రాగిలో ఉండే యాంటీ-ఆక్సిడెంట్స్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన రోగాల నుండి కాపాడుతాయి. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వారు చేసిన పరిశోధనాల ప్రకారం రాగి క్యాన్సర్‌ను ఎలా రానివ్వకుండా చేస్తుందో కనుగొనలేకపోయారు. కాని రాగి నిరంతరం క్యాన్సర్ వ్యాపింపజేసే వైరస్‌ను అడ్డుకోవడంలో తోడ్పడుతుందని ఆ పరిశోధనల్లో తేలింది.

# పవన్ ఇకపై సినిమాలు చేయడా..?



వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తన భవిష్యత్తు ప్రణాళికలు స్పష్టం చేశారు. "భవిష్యత్తులో రాజకీయాలా, సినిమాలా?" అనే ప్రశ్నకు, పవన్ కళ్యాణ్ స్పష్టంగా.. "రాజకీయాలకే నాతొలి ప్రాధాన్యత అని చెప్పుకొచ్చారు. దాతర్వాత సినిమాలు అని అన్నారు. నాకు వచ్చింది సినిమాల్లో నటించడమే. నాకఅన్నం పెట్టింది, బతుకుదెరువు ఇచ్చింది కూడా సినిమాలే అని పవన్ అన్నారు. రాజకీయాల్లో బిజీగా ఉండడం వల్ల ఇప్పటికే మూడు సినిమాలు ఆగిపోయాయి.నావల్ల నిర్మాతలు నష్టపోకూడదన్న ఉద్దేశంతోడేట్స్ అడ్జస్ట్ చేసుకుని షూటింగుల్లో పాల్గొంటున్నా. 'హరిహర వీరమల్లు' సినిమాకు అయితే ఐదేళ్లుగా నిర్మాణం సాగుతోంది. సినిమాకోసం నిర్మాత ఏఎం రత్నం చాలా త్యాగాలు చేశారు. ఆయన్ను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రమోషన్లలభాగమవుతున్నా. సినిమా హిట్ అవుతుందా లేదా అన్నది తర్వాతి విషయం. కానీ మొదట అది రిలీజ్ అవ్వాలి. ఈ సినిమా విజయవంతమవుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు.

సినిమాలపై ప్రేమ ఉన్నప్పటికీ, ఇకపై నటనకు అంత సమయం కేటాయించలేనని పవన్ చెప్పారు."ఓవైపు డిప్యూటీ సీఎం పదవిలో బాధ్యతలు, మరోవైపు జనసేన పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యం. సినిమాల్లో నటించాలంటే కనీసం రెండు,మూడేళ్లు పడుతుంది.ప్రస్తుతం నటుడిగా కాకపోయినా, నిర్మాతగా సినిమాల్లో కొనసాగాలని అనుకుంటున్నా. సినిమాలు నాఇంధనం. నిర్మాతగా మారితే, ఇండస్ట్రీతో టచ్‌లో ఉడగలుగుతాను. డబ్బులూ వస్తాయి. నాకు వేరేవ్యాపారాలేమీ లేవు కాట్టి,సినిమాలే దిక్కు అని వివరించారు. ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి, పూర్తిగా రాజకీయాల్లోకి వెళ్లడం నా టార్గెట్. హరిహర వీరమల్లు సినిమాలో నేను కోహినూర్ వజ్రం కోసం పోరాడే యోధుడిగా కనిపిస్తా. ఇది ఔరంగజేబు హింసా పాలనపై ఆధారపడిన కథ" అని వివరించారు. అయితే పవన్ తాజా వ్యాఖ్యలు ఆయన అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, గతంలో కూడా ఇటువంటి ప్రకటనల తర్వాత సినిమాల్లోకి తిరిగొచ్చిన సందర్భాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చూడాలి మరి రానున్న రోజులలో పవన్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో..!

# సినిమా..

## రాంచరణ్ నయా ప్లాన్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో పెద్ది సినిమా చేస్తున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. కాగా పెద్ది సెట్స్‌పై ఉండగానే రాంచరణ్ నయా ప్లాన్‌కు సంబంధించిన న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇంతకీ విషయమేంటంటే రాంచరణ్ ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్లాన్ చేసుకున్నాడట. ఇందులో భాగంగానే కేజీఎఫ్, సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశాలున్నాయని వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లాంచ్ కంటే ముందు రాంచరణ్ చేతిలో చాలా సమయం ఉండనుండగా.. ఈ టైంలో పలువురు పాపులర్ డైరెక్టర్లతో కథా చర్చలు జరుపాలని నిర్ణయించుకున్నాడని ఫిలింనగర్ సర్కిల్‌లో న్యూస్ ఒకటి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అన్నీ అనుకున్నట్టు కుదిరితే రాంచరణ్ మరికొన్ని రోజుల్లో తన కొత్త ప్రాజెక్ట్‌పై ప్రకటన కూడా చేయబోతున్నాడని జోరుగా టాక్ నడుస్తోంది.

రాంచరణ్ నటిస్తోన్న పెద్ది మార్చి 27న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీ విడుదలకు ముందే కొత్త సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాలనుకుంటున్నాడట రాంచరణ్. మరి ఇదే నిజమైతే రాంచరణ్ పెద్ది సినిమా అప్‌డేట్స్‌తోపాటు రానున్న రోజుల్లో కొత్త సినిమాలకు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేసుకోబోతున్నాడన్నమాట. ఇక రాంచరణ్ అభిమానులకు పండగేనన్నమాట. రాంచరణ్ రంగస్థలం తర్వాత సుకుమార్‌తో మరో సినిమాకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే.

# పవన్ సినిమాలో రాశీ ఖన్నా..




టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథానాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాలో శ్లోక అనే పాత్రలో కనిపించబోతుంది రాశీ. ఈ సందర్భంగా రాశీ ఫొటోను చిత్రయూనిట్ పంచుకుంది. మరో వైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్–హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# కొత్తగా తల్లి అయిన వారికి తక్కువ పని గంటలుండాలి : విద్యాబాలన్



సినీ పరిశ్రమలో పని గంటలపై జరుగుతున్న చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి విద్యాబాలన్ ఈ అంశంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా.. ఇటీవల నటి దీపికా పదుకొనే, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాల మధ్య 'స్పిరిట్' సినిమా విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, విద్యాబాలన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కొత్తగా తల్లి అయిన హీరోయిన్‌లకు లేదా ఇతర రంగాలలో చేసే ఆడవారికి సౌకర్యవంతమైన, తక్కువ పని గంటలు ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది.దీనివలన తల్లి బిడ్డతో గడపడంతో పాటు తనను తాను మేనేజ్ చేసుకుంటుందని విద్యా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల పరిశ్రమలో తక్కువ పనిగంటలు.అనుకూలమైన వర్కింగ్ అవర్స్ కావాలని కోరుతున్నారు. ఇది కూడా సరైనదే అని అనుకుంటున్నాను. అయితే ఎవిషయంలో నేను చేసే సినిమాలకు, ఎనిమిది గంటలు మాత్రమే షూట్ చేయలేము.

# రష్మీ ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకుంది...!



జబర్దస్త్ హాట్ యాంకర్ రష్మీ గౌతమ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందం, అభినయం ఉన్న ఈ భామ.. హీరోయిన్ మెటీరియల్ అయినా కూడా ఛాన్స్ లు మాత్రం దక్కడం లేదు. అయినా కూడా అడపాదడపా హీరోయిన్ గా కనిపిస్తూనే ఉంది. జబర్దస్త్ నుంచి వెండితెరకు వచ్చిన అనసూయ.. ప్రస్తుతం ఎంత బిజీగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ, రష్మీ మాత్రం జబర్దస్త్ ను వదలకుండా యాంకర్ గా కొనసాగుతూనే సినిమాల్లో కూడా బిజీగా మారింది. ఇక నిత్యం రష్మీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూనే ఉంటుంది. ముఖ్యంగా జంతు ప్రేమికురాలు అయినా రష్మీ.. వాటికి ఏదైనా అయితే మాత్రం అస్సలు తట్టుకోలేదు. వా టిని సంరక్షించాలని కోరుతూ ఉంటుంది. మూగ జీవాలు అంటే ఆమెకు ప్రాణం. అయితే ఈమధ్యనే రష్మీకి సర్జరీ జరిగిన విషయం తెల్సిందే. దానివలన ఆమె కొన్నిరోజులు వృత్తికి దూరమయ్యినట్లు కూడాతెలిపింది. అయితే తాజాగా రష్మీ మరో కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. వృత్తితో పాటు సోషల్ మీడియాకు కూడా ఆమె ఒక నెలరోజులు దూరంగా ఉండనున్నట్లు తెలిపింది. 'హలో అందరికీ నెల రోజుల పాటు అవసరమైన డిజిటల్ డిటాక్స్ తీసుకుంటున్నా ను. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కొన్ని అవరోధాలను ఎదుర్కొం టున్నాను. నేను మీ అందరికీ మాట ఇస్తున్నాను. కచ్చితంగా నేను ధృడంగా తిరిగివస్తాను. నేను నా శక్తిని పునరుద్ధరించుకోవాలి. నన్ను నేను మెరుగుపరుచుకోవాలి. నాకు ఏది కావాలి.. ఎలాంటివి కావాలని నా ఆత్మా పరిశీలన చేసుకోవద్దని సమయం పడుతుంది. అందరూ నేను బలంగా ఉన్నానని అనుకుంటారు. కానీ, నేను కూడా చాలా కృంగిపోయాను. వాటన్నింటిని సరిదిద్దుకోవాలి. నేను ఉన్నా లేకున్నా మీ ప్రేమ నాపై ఎల్లప్పుడూ ఉంటుందని ఆశిస్తు న్నాను' అంటూ రాసుకొచ్చింది. అంతేకాకుండా ఏదీశాశ్వతం కాదు. ఈ కాలం గడిచిపోతుంది' అంటూ చెప్పుకొచ్చింది. రష్మీ పోస్ట్ వెనుక ఆంతర్యం ఏంటి.. ? నిజంగానే డీటాక్స్ కోసం ఈ నిర్ణయం తీసుకుందా.. ? లేక వేరే ఏదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ పోస్ట్ చూసిన అభిమానులు ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకున్నావ్ రష్మీ.. అన్ని సెట్ అవుతాయి. జాగ్ర త్తగా ఉండు అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కొందరేమో జబర్దస్త్ నుంచి రష్మీ బయటకు వచ్చేసిందని, కొత్త ప్రాజెక్ట్ ఓకే చేయడంతో దానికోసం ప్రిపేర్ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఏది నిజమో అనేది తెలియాల్సి ఉంది.

# యాక్టింగ్‌లో ఆ ఇద్దరు మాస్టర్స్..!



షరతుల చిట్టా విప్పి సందీప్‌రెడ్డి వంగా ఆగ్రహానికి గురై 'స్పిరిట్' అవకాశాన్ని చేజార్చుకున్న బాలీవుడ్ భామ దీపికా పదుకొనే.. రీసెంట్‌గా అల్లుఅర్జున్, అట్లీ సినిమాకు సైన్‌చేసింది. దాంతో ఒకచోట పోగొట్టుకున్న అవకాశం మరోచోట దక్కినట్టయ్యింది ఈ అందాలభా మకు.'కల్కి 2898ఏడీ'లో ప్రభాస్..అట్లీ సినిమాతో బన్నీ.. ప్రస్తుతానికి టాలీవుడ్‌కి చెందిన ఇద్దరు అగ్రహీరోలు కవర్ అయిపోయారు. అయితే.. దీపికా తీరు చూస్తుంటే వీరిద్దరితో ఆగేలా లేదు. టాలీవుడ్ అంతా కవర్ చేసేందుకు ప్రణాళికలే రచిస్తున్నట్టుంది ఈ బెంగళూరు భామ.

రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో 'నేను టాలీవుడ్‌లో మహేష్, తారక్‌ల అభిమానిని. వారిద్దరూ నటనలో మాస్టర్స్. వారితో కలిసి నటించాలనుంది.' అంటూ పేర్కొన్నది.

దీపికా నోటి వెంట మహేష్, తారక్‌ల ప్రస్తావన రావడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైం ది. గతంలో టాలీవుడ్‌లో మీకెవరు తెలుసు? అనడిగితే 'మహేష్' అని అదోలా నవ్వుతూ.. మిగతా హీరోలెవరూ తెలీనట్టు ప్రవర్తించిన దీపిక.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు భజన చేయడం చూసి.. 'మార్పు మంచిదే' అంటూ వెటకారంగా కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com